

3

పనులు వేగవంతం



గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డొంకరోడ్డు మూడు వంతెనల ఆర్‌యూబీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ఆ మార్గాన్ని రోడ్డు ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ పనులు వేగవంతం చేసింది. రెండు వైపులా కలిపి 58 ఆర్‌సీసీ బ్లాకులను అమర్చి ఆర్‌యూబీని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం వారం నుంచి 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నాటికి 58వ రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించా లని కోరుతూ అర్జీలు ఇవ్వగా, వాటిని పరిశీలించి 'ఇబ్బంది వద్దు... అండగా ఉంటా'నని వారికి హామీ ఇచ్చారు. 4



దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

- మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
- దాతృత్వానికి మారు పేరుగా మారాలి

4

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

- కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేయాలి
- సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారందరికీ రుణాలు ఇవ్వాలి
- డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు చేయిచేయి కలపాలి.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసి జిల్లాను అన్నిరంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు సమన్వయంతో కలిసి పని చేయాలి.. అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించిన అంశాలను మరింతగా మెరుగుపర్చేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం త్వరలోనే కౌలు రైతుల కోసం చట్టం తెస్తుందన్నారు. సీసీఆర్సీ కార్డులు ఉన్న కౌలు రైతులకు రుణాలను మార్చి 15లోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

- మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు ఇచ్చిన వారందరికీ రుణాలు మంజూరు చేసేలా నియోజక వర్గాల వారీగా డ్రైవ్ చేపట్టాలన్నారు.
- శాసన మండలి చీఫ్ విప్ పంచుమూర్తి అనురాధ మాట్లాడుతూ మంగళగిరి పరిధిలో రైతులకు సాగునీరు సక్రమంగా అందించేలా కేడబ్ల్యు కెనాల్ మరమ్మతులు చేపట్టాలన్నారు. రహదారుల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.
- కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు బీమా కంపెనీ ద్వారా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న ఇండస్ట్రీ పాలసీపై సంబంధిత శాఖలతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.
- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా ప్రాధాన్య అంశాలపై ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేస్తే సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కారమౌతాయన్నారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు పనులకు అవసరమైన భూసేకరణకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్ విలీనంలో ఉర్దూ స్కూల్స్‌కు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత కార్మికులు సమస్యలను పరిష్కరించేలా, ఆప్కో ఉత్పత్తులు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ధూళి పాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ దీపం 2 పథకంలో నగదు జమలో ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అమ్ముకునే లబ్ధిదారులకు కార్డులు రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వాలన్నారు. మేడికొండూరు మండలంలో అనర్హులకు పంట నష్టపరిహారం అందించిన వ్యవసాయశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొండవీడు టూరిజం సర్క్యూట్‌లో ఫిరంగిపురం కార్మెల్ మాతా చర్చిని చేర్చాలన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కృష్ణనగర్‌లోని రైతుబజార్ నిర్మాణం ప్రారంభించాలన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు వచ్చిన తర్వాత రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎక్కువైందని, గతంలో ఉన్న విధంగానే బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కాకుమానువారి తోటలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి అదనపు నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్‌జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, వేదికపై మంత్రి మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

రేషన్ అక్రమాలపై ఎమ్మెల్యేల ధ్వజం

రేషన్ సరుకుల పంపిణీలో జరుగుతోన్న అక్రమాలపై టీడీపీ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. పౌరసరఫరాల శాఖ ఉదాసీనత వల్లే రేషన్ బియ్యం దారిమళ్లింపు వ్యవస్థీకృతంగా మారిపోయిందని ఆరోపించారు. రేషన్ అక్రమాలపై ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు ప్రసంగించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న నిందితులను అరెస్టు చేసి లోపలకు పంపాలని ఎమ్మెల్యే నరేంద్ర సూచించారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మేడికొండూరు వద్ద రైసుమిల్లుల్లో లెవీ కంటే అదనంగా బియ్యం ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రేషన్ మాఫియా ఓపెన్‌గా జరుగుతున్నదని సివిల్ సప్లయిస్‌ని జీఏడీ నుంచి వేరు చేస్తే ఫలితం ఉంటుందన్నారు. రేషన్ అక్రమాల విషయంలో ఎమ్మెల్యేల వాదనతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నామమాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకొంటున్నారని పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేపదే రేషన్ అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు కేసులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఎండీయూలను తీసేసే విషయంపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, దీనిపై త్వరలోనే ఒక నిర్ణయానికి రావడం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నరేంద్ర, శావణ్‌కుమార్, రామాంజనేయులు, నసీర్, మాధవి, ఎమ్మెల్సీలు కల్పలతరెడ్డి, కేఎస్ లక్షణరావు, హనుమంతరావు, ఏసురత్నం

రైల్వే పనుల్లో.. ఇష్టారాజ్యం



- అమృత్ భారత నిధులతో జరుగుతున్న రైల్వే పనుల్లో డొల్లతనం
- పర్యవేక్షణ అంతంతమాత్రమే
- కాంక్రీట్ పనుల్లో అంతా ఇసుకే
- ఇటుకలూ నాశిరకమే...
- రూ. కోట్ల విలువైన పనుల్లో అంతా తూతూ మంత్రమే



సిమెంట్ చాలా పొదుపుగా... కంకర మరింత ఎక్కువగా, ఇసుక ఇంకాస్త దండిగా కలిపేసి కట్టడాలు కట్టేస్తే ఏమవుతుందో అందరికీ తెలిసిందే. అయితే రైల్వే కాంట్రాక్టర్లు మాత్రం దీనిని తూచా తప్పకుండా పాటిస్తూ నిర్మాణాలు చేసేస్తున్నారు. తాము నిర్మిస్తున్న కట్టడాలు అత్యంత పటిష్టతతో ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామనుకుంటున్నారో! లేక రైల్వే పనులేకదా! ఎవరు చూడొచ్చారులే అనుకున్నారో కానీ, ఇష్టమొచ్చినట్టు చేసేస్తున్నారు. అమృత భారత్ పేరుతో కేంద్రం అన్ని రైల్వే స్టేషన్‌లను ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు రూ. వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణాలు చేపడుతుంటే, వాటిని పట్టుమని పదికాలాలపాటు పదిలంగా ఉండేలా కాకుండా పేకమేడల్లా కట్టేస్తుండటం ఆందోళన కలిగించే విషయం.

తెనాలి, జనవరి 28, (ఆంధ్ర జ్యోతి): సాధారణంగా ఏ కాంక్రీట్ మిశ్రమాన్నయినా సిమెంట్, కంకర, ఇసుక 1:2:4 నిష్పత్తిలో కలుపుతారు. అయితే రైల్వే పనులు చేస్తున్న కూలీలను ప్రశ్నిస్తే మాత్రం తడుముకోకుండా 1:4:6 రేషియోలో కలుపమన్నారని చెబుతుంటే, ఆచరణలో మాత్రం 1:7:6 రేషియోలో కలిపేస్తూ కనిపించారు. 1 కట్ట సిమెంట్‌కు బదులు అరకట్ట సిమెంట్, 7 బొచ్చెల ఇసుక, 6 బొచ్చెల కంకర కలిపేసి పనులు చేసేస్తున్నారు. ఇదంతా ప్లాట్ ఫారం పనులకోసం చేస్తుంటే, భవనాలు, ఆధునిక టాయిలెట్స్ మాత్రం ఇంకొంత మెరుగుగా, ఈ పాళ్లను తగ్గించి సిమెంట్ కలిపి కట్టడాలు కట్టేస్తున్నారు. 1వ నంబర్ ప్లాట్‌ఫారం, లోపలి ప్లాట్ ఫారంలపై పనులు జరుగుతుంటే సాయంత్రం వరకు ఒక్క వర్క్‌ఇన్స్‌పెక్టర్ కానీ, ఇంజనీరింగ్ సిబ్బందికానీ లేకుండా, ఎటువంటి పర్యవేక్షణ లేకుండా కూలీలే కాంక్రీట్ ఇష్టమొచ్చినట్టు కలిపేసి కట్టడాలు కట్టేస్తుండటం విశేషం. అయితే సాయంత్రానికి మాత్రం ఒకరిద్దరు వచ్చి, వారు చేసిన పనిని లెక్కవేసుకుని వెళ్లిపోవటం మినహా, కచ్చితమైన పర్యవేక్షణ మాత్రం లోపించింది. దీంతో తాపీ కూలీలే ఇక్కడ ఇంజనీర్‌ల తరహాలో పనులు చేసేయటం, తమ కాంట్రాక్టర్‌కు చెప్పినదానికంటే మరికొంచెం లాభం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి కాంక్రీట్ మిశ్రమాన్ని కలిపేయటం వంటివి ఇక్కడ షరా మామూలయిపోయాయి.



రాలిపోతున్న ప్లాస్టింగ్

భారీ అభివృద్ధి జరుగుతుంటే..

రైల్వేశాఖ పరిధిలో అమృత్‌భారత్ పథకం ద్వారా వివిధ రైల్వేస్టేషన్లను ఆధునీకరించటం, వసతులు కల్పించటం, సుందరంగా తీర్చిదిద్దటం వంటి పనులను చేపట్టారు. దీనిలో తొలి విడత స్టేషన్‌లలో తెనాలి రైల్వే స్టేషన్‌కూడా ఒకటి. ఇక్కడ ప్లాట్ ఫారంల విస్తరణ, ప్లాట్‌ఫారం షెడ్‌ల నిర్మాణం, ఆధునిక వసతులతో టాయిలెట్స్ నిర్మాణం, ప్రయాణికుల విశ్రాంతి భవనాల వంటివి నిర్మిస్తున్నారు. అమృత్ భారత్ కాక, గతిశక్తి కింద ఆరో ప్లాట్‌ఫారం, గూడ్స్ షెడ్ ఏర్పాటు, అంధులకు బ్రెయిలీ లిపితో కూడిన బోర్డ్‌ల ఏర్పాటు, పెయిడ్ వెయిటింగ్ లాబీల వంటివి నిర్మిస్తున్నారు. ఆర్.వి.ఎన్.ఎల్ కింద మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులూ జరుగుతున్నాయి. ఇదికాక గతంలో ఎప్పుడూ నిర్మించని రీతిలో 12 మీటర్ల వెడల్పులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకూడా చేపట్టారు. దీనిపైనే ప్రయాణికులు వేచిఉండేలా, స్టాల్స్‌తో సహా అన్ని ఏర్పాట్లు ఉండేలా దీని నిర్మాణం ఉండనుంది. అభివృద్ధి పనులయితే గతంలో లేనిరీతిలో జరుగుతుంటే, పనుల్లో నాణ్యత మాత్రం దారుణంగా తయారయింది.

నాణ్యత డొల్లేనా!

ప్లాట్‌ఫారంపై గ్రానైట్ సొబగులు అద్దేలా పనులు చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫారంలపై పనులు జరిగిపోతున్నాయి. అయితే వాటిని అమర్చటానికి కింద కాంక్రీట్ బెడ్ వెయ్యాల్సిఉంటే, దీనిని పూర్తి నిబంధనలకు విరుద్ధంగా కలిపేస్తున్నారు. 1:2:4 నిష్పత్తి పక్కనపెట్టేసి, 1:4:6 అంటూ ఆ రేషియో ప్రకారం కూడా కాంక్రీట్ కలపటంలేదు. మొత్తం ఇసుక, మెటల్ మాత్రమే ఉండటంతో నాణ్యతలో డొల్లతనం ప్రత్యక్షంగానే కనిపిస్తోంది. దీనికి ముందు కాంక్రీట్ పటిష్ఠంగా ఉండటానికి అంచులవెంట బలంగా ఉండేలా ఇటుక రాళ్లతో నిర్మాణం చేస్తున్నారు. అయితే దీనికి వాడుతున్న ఇటుక నాశిరకంగా ఉంటే, సిమెంట్ వేశారా! లేదా! అన్నట్టున్న మిశ్రమంతో పనులు చేయటం విశేషం. అయితే ఇటుకలు అతికేందుకు వేసిన సిమెంట్ అక్కడక్కడ ఊడిపోయి, రాళ్లు కదిలిపోయి కనిపిస్తున్నాయి. ఇదిలాఉంటే... లోపల మసిపూసి, పైన అందంగా గ్రానైట్ రాళ్లు వెసినా, ప్లాట్‌ఫారం అంచుల వెంట సిమెంట్ చెయ్యాల్సిఉంటే, దీనిలోనూ కక్కుర్తి చూపుతున్నారు. ప్లాస్టింగ్ చేసిన ప్రదేశాల్లో ఇసుక రాలుతున్నట్టు కనిపించటం విశేషం. ఇదికాక ప్లాట్ ఫారం షెడ్డు వేశాక దానికి ఉపయోగించిన ఇనుప గడ్డర్‌ల వంటి పిల్లర్ల దగ్గర ప్రయానికులు కూర్చునేందుకు ఇటుకతో ఒంటిరాయి గోడలు నిర్మించి, దానిపై గ్రానైట్ రాళ్లు అమర్చుతున్నారు. అయితే కింద జరుగుతున్న నిర్మాణంలో రాళ్లు ఒక సమస్యయితే, సిమెంట్ సరిగాలేక రాళ్లు అప్పుడే ఊడిపోతున్నాయి.

గతంలో ఇదే తరహాలో వేసిన అరుగుల గ్రానైట్ పలకలు పగిలిపోయి కూర్చోటానికి వీలు లేకుండా పగిలిపోయి కనిపిస్తున్నా, మళ్లీ అదే తరహాలో పనులు చేయటం వారికే సాధ్యం. ఇది కాక.. ప్రయాణికుల విశ్రాంతి గది, దానిలోనే ఆధునిక హంగులతో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. ఈ తరహాలో రెండు భవనాలు నిర్మాణం జరుగుతుంటే, వాటి పిల్లర్లే కాంక్రీట్ ఊడిపోయి కనిపిస్తుంటే దానిపై సిమెంట్ పూతపూసి సరిచేస్తున్నారు. గోడలు కొంతవరకు పగుళ్లు రాకుండా పర్వాలేదనిపిస్తున్నా, ప్లాస్టింగ్‌లోనూ కక్కుర్తి కనిపిస్తూనే ఉంది. కాంక్రీట్ దిమ్మెలతో జరుగుతున్న నిర్మాణాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటివాటికి జరుగుతున్న పనుల్లో పిల్లర్ల కాంక్రీట్ పనులు మాత్రం నిబంధనల ప్రకారం జరుగుతున్నట్టు కనిపిస్తున్నాయి. విద్యుత్తు లైన్‌లకు సంబంధించి ఏర్పాటుచేసే బాక్సులకోసం కాంక్రీట్‌తో బాక్సులు నిర్మిస్తుంటే, దీనికోసం కాంక్రీట్‌ను నాశిరకంగా కలుపుతూ కనీసం బొచ్చెలతో కాకుండా ప్లాస్టిక్ కవర్‌లలో కాంక్రీట్‌ను మిక్సర్ నుంచి పోసుకుని బాక్సు గుంతల్లో పోయటం వీరికే సాధ్యమన్నట్టుంది. కనీసం బొచ్చెలు తీసుకుని, దానిలో కాంక్రీట్ పోసుకుని బాక్సులకు పోయటం కాకుండా కవర్‌లతో పోస్తుండటంతో ఆ మిశ్రమంలోని సిమెంట్ నీటి రూపంలో సగం కింకు కారిపోతూనే ఉంది. దీంతో వీటి నిర్మాణంలో పటిష్టత ఎంతనేది ప్రశ్నార్థకమే. భవన నిర్మాణాలకు సంబంధించి ఆధునిక పరికరాలు చాలావచ్చేస్తే, ఇక్కడ అవేమీ ఉపయోగించకపోగా ఎవరూ వాడనటువంటి పద్ధతిలో పనులు చేయటం విశేషం. అయితే దీనిపై వివరణ కోరేందుకు రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులను సంప్రదిస్తే కింది స్థాయి అధికారులు మాకు వివరణ ఇచ్చే అధికారం లేదని, ఉన్నతాధికారులనుంచి తీసుకోవాలనే సమాధానం వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులకోసం ప్రయత్నం చేస్తే అందుబాటులో లేని పరిస్థితి.



అంచులు పగుళ్లు



భవనం పిల్లర్‌కే అతుకులు

బోరుగడ్డ అనిల్‌పై చీటింగ్ కేసు

4

మిర్చియార్డు అధికారులకు సీఎం అభినందన

- రైతులకు ఉచిత భోజనంపై 'ఎక్స్' వేదికగా సందేశం

రూ.53 కోట్లతో వంద పడకల ఆస్పత్రి

- దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరిలో నిర్మాణం
- ప్రతిపాదనలపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

మంగళగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో రూ.53 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆస్పత్రి నిర్మాణం గురించి ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం ఆయన ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. భవన నిర్మాణ నమూనాను ప్రదర్శించిన అధికారులు మంత్రికి వివరాలను తెలిపారు. నమూనాను పరిశీలించిన అనంతరం లోకేశ్ వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతి వేగంగా ఆస్పత్రి నిర్మించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆస్పత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టడం తనకు చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఉండేలా ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడడంలో అధికారులు శ్రద్ధ వహించాలని లోకేశ్ కోరారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల భవనాలను పరిశీలించి మౌలిక సదుపాయాలతో అత్యుత్తమంగా ఉండేలా నమూనాను రూపొందించామని చెప్పారు. 15 రోజుల్లో భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరిపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ గ్రూప్ ఎండీ ఏ భార్గవ్, డీజీఎమ్ కిషోర్, సీనియర్ ఇంజనీరు అనిల్, వీసీ అండ్ ఎండీ పీఎస్ గిరీష, వాస్తు కన్సల్టెంట్ జయరామిరెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ సీఈ కె శ్రీనివాసరావు, ఎస్ఈ వి చిట్టిబాబు, ఈఈ సీవి రమణ, డీఈఈ ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

బోరుగడ్డ అనిల్‌పై చీటింగ్ కేసు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగేతరశక్తి మాదిరిగా అరాచకాలతో రెచ్చిపోయిన రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ పై మరో చీటింగ్ కేసు నమోదయింది. చర్చి నిర్మాణానికి విదేశీ నిధులు ఇప్పిస్తానని ఓ పాస్టర్‌కు ఆశ కల్పించి ఆయన వద్ద నుంచి బలవంతంగా రూ.5 లక్షలు గుంజుకుని బెదిరింపులకు పాల్పడిన ఘటనపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన నల్లపు మరియదాసు చిలకలూరిపేటలో ఏఈఎల్‌సీ పాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో 2020లో నాదెండ్ల మండలం సాతులూరుకి చెందిన బోరుగడ్డ అనిల్ బంధువు రాజేంద్ర ద్వారా మరియదాసు పరిచయమయ్యాడు. తనకు ఏఈఎల్‌సీలో మంచి పరిచయాలు ఉన్నాయని, తద్వారా చర్చికి విదేశీ నిధులు తెప్పిస్తానని పాస్టర్ మరియదాసును నమ్మించాడు. కోటి రూపాయలు వరకు విదేశీ నిధులు తెప్పిస్తానని చెప్పి ఇందుకుగాను రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. అయితే, తన వద్ద అంత మొత్తం లేదని చెప్పిన మరియదాసు, తన బంధువుల వద్ద రూ.5 లక్షలు అప్పుగా తెచ్చాడు. ఈ మొత్తాన్ని అనిల్‌కు ఇచ్చేందుకు రాజేంద్రనగర్ మూడో లైన్‌లోని ఆయన ఇంటికి వెళ్ళాడు. విదేశీ నిధులు ఏవిధంగా తెప్పిస్తారో వివరాలు చెబితే, తాను తెచ్చిన డబ్బులు ఇస్తానని అనిల్‌కు మరియదాసు చెప్పాడు. దీంతో రెచ్చిపోయిన అనిల్, మరియదాసును తిట్టి, ఆయన వద్ద ఉన్న రూ. 5 లక్షలను బలవంతంగా లాక్కున్నాడు. 'నీకు విదేశీ నిధులు ఇప్పిస్తాను, అప్పుడు కూడా వచ్చిన దానిలో నాకు వాటా ఇవ్వాలి' అని బెదిరించాడు. అయితే, ఆ తరువాత విదేశీ నిధులు రాకపోవడంతో కొంతకాలం ఎదురుచూసిన మరియదాసు, ఆ తర్వాత తన డబ్బు తనకు ఇవ్వమని అడిగాడు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవగా బెదిరింపులకు పాల్పడ్డాడు. మరియదాసు తన డబ్బు కోసం అనేకసార్లు అడిగాడు. రేపు, మాపు అంటూ అనిల్ కాలయాపన చేస్తూ వచ్చాడు. అప్పుల వారి నుంచి తనపై ఒత్తిడి ఉందని తన డబ్బు తనకు తిరిగి ఇవ్వాలని కోరాడు. గట్టిగా అడిగితే ప్రస్తుతం తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఏమి చేయలేవని మరియదాసును బెదిరిస్తూ వచ్చాడు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 'నీ డబ్బు నీకు ఇచ్చేస్తాను' అంటూ నమ్మిస్తూ కాలయాపన చేశాడు. ఆ తర్వాత అనిల్ జైలుకు వెళ్లడంతో తాను మోసపోయినట్లు మరియదాసు గ్రహించాడు. తనను మోసం చేసిన అనిల్, ఆయన తమ్ముడు రాజేంద్రలతో తాను చేసిన వాట్సాప్ చాటింగ్, మెసేజీలు వాయిస్ రికార్డింగ్స్‌ను పోలీసులకు అందజేశారు. దీంతో, అనిల్‌పై ఐపీసీ 386, 420, 506 తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులూ.. కష్టపడి చదువుకోండి

● పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

రాజుపాలెం,జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మం డల కేంద్రం రాజుపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగ న్వాడీ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో కొంచెం సేపు ముచ్చటించారు. తరగతి గదిలో చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని వారిని అడిగారు. 'బాగా చదువుతున్నారా? మీకు మెటీరియల్ ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు.

ఇబ్బంది వద్దు.. అండగా ఉంటా

● ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్ హామీ



ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నాటికి 58వ రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లోకేశ్‌కు అర్జీలు ఇవ్వగా, వాటిని ఆయన పరిశీలించారు. 'ఇబ్బంది వద్దు... అండగా ఉంటా'నని వారికి ఆయన హామీ ఇచ్చారు.

మదర్సాలలో విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించండి

మదర్సాలలో పని చేస్తున్న విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించడంతోపాటు గత వైసీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు మదర్సా విద్యావాలంటీర్లు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య పేరుతో ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని తన పేరుతో ఆన్‌లైన్ చేయాలని సత్తెనపల్లి మండలం రెంటపల్లికి చెందిన రామ్ గోపాల్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య రెండేళ్ల క్రితం రెండేళ్ల క్రితం కేన్సర్‌తో చనిపోయిందని, ఆమె పేరుపై మురుకొండపాలెంలో నాలుగు ఎకరాల పొలం ఉందని అధికారులకు చెప్పినప్పటికీ హక్కులు కల్పించలేదని విజ్ఞప్తి చేశారు.

సమ్మర్ స్టోరేజి నిర్మాణం పూర్తి చేయండి

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమ్మర్ స్టోరేజి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం సంతెకుడ్లూరు గ్రామస్తులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఎగువ ప్రాంతానికి తాగునీటి సరఫరా కోసం రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో బహుజనులకు సంబంధించి రద్దు చేసిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతోపాటు ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏలూరుకు చెందిన బహుజన సేవా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎల్‌జీఎస్‌గా పని చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, తిరుపతి టీఎస్‌టీయూసీ అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర ఆటో టాక్సీ వర్కర్స్ యూనియన్ సభ్యు లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు.



చిత్తూరు జిల్లా ఐరాల మండలం, పోలకల పంచాయతీలోని జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎర్రచెరువుపల్లి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసు కెళ్లారు. ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా రాయచోటిలో నివాసం ఉండే తాము 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేయగా నష్టం వచ్చిందని, దీంతో గ్రామంలో ఆరు లక్షల వరకు అప్పుల య్యాయని విజయవాడ వచ్చిన తమ కుటుంబాన్ని ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

హెచ్‌ఎంతో సహా ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు (విద్య)జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి అయితానగర్ లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ మున్సిపల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఏడు గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈఓ సివి రేణుక మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ సమయంలో ఒకేసారి ఏడుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు గైర్హజరయ్యారు. ఈ నేపథ్యంలో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎఫ్ ఏ3 పరీక్షలు ఉన్న సమయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొ న్నారు. దీంతో పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

● బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
● దాతృత్వానికి మారుపేరుగా మారాలి



పెదకాకాని, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేవుని సన్నిధిలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సంతోషం లభిస్తుందని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శామ్యూల్ కిరణ్ తన వాక్యోపదేశం కొనసాగిస్తూ.. ప్రభువుని స్థిర హృదయంతో హత్తుకొనడం ద్వారా మనలో ఉన్న మాలిన్యం తొలగి పరిపూర్ణ వ్యక్తులుగా మారతామన్నారు. మానవ శరీరంలో అవయవాలన్నీ ఒకే రీతిలో సమిష్టిగా, శ్రద్ధగా పనిచేస్తాయో అదే మాదిరిగా ప్రతి క్రైస్తవ విశ్వాసి భాగస్వామ్యం కలిగి సంఘాల అభివృద్ధికి దోహదపడాలని పిలుపు నిచ్చారు. నేటి సమాజంలో నిరాశ, నిరుత్సాహం, అభద్రతాభావం వంటి అంశాలతో అనేక మంది ప్రజలు మనోవేదనతో ఉన్నారని తెలిపారు. నేటి సమాజంలో ఉన్న ప్రజలు ఇతరులపై ప్రేమ కనబరు చుట, సత్కా ర్యాలు చేయుట, సహవాసం,స్నేహభావం, సత్ భక్తి, సమాధానంతో పాటుగా పరస్పరం ప్రోత్సహించుకునేందుకు, దాతృత్వం చేసేందుకు నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. మరనాత నామస్మరణతో మహోత్స వాల ప్రాంగణం మారు మోగింది.

రజతోత్సవం

బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థిశాల నిర్వా హకుడు జె. శామ్యూల్ కిరణ్ మహోత్సవాల నిర్వహణ బాధ్యతను చేపట్టి ఈ సంవత్సరానికి 25 సంవత్స రాలు పూర్తయ్యాయి. ఈ సంద ర్భంగా రజతోత్సవం నిర్వహించారు. ప్రార్థనలు చేశారు. తొలుత కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పీ జాన్ దేవదాసు ప్రార్థన చేశారు. బైబిల్ గ్రంథంలోని ఏలియా ప్రవక్త గురించి వివరించారు. ప్రపంచ ప్రజలను మేలుకొలిపేందుకు ఈ మహోత్సవాలు దోహద పడతాయ న్నారు. జాయింట్ సెక్రటరీ జే ఆగమనరావు ప్రసంగిస్తూ దేవుని ఆరాధించేవారు కృతజ్ఞత భావం కలిగి ఉండాలన్నారు. ఏసుప్రభువును వెంబడించిన శిష్యులు తగ్గించుకొని ధన్యు లయ్యారని, అదే మాదిరిగా ప్రతి ఒక్కరూ తగ్గింపు జీవిత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జే. వినోద్ కుమార్, పాస్టర్లు జీ శామ్యూల్, వీ సతీష్ బాబు దైవ సందే శాలు అందించారు. కాగా, బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి.

రంగురాళ్ళ కోసం వెళ్లి కెనాల్‌లో గల్లంతు



తాజుద్దీన్ (ఫైల్)

నకరికల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంగురాళ్ల కోసం తన స్నేహి తులతో కలిసి వెళ్లిన యువకుడు, వాటిని కడిగేందుకని వెళ్లి కెనాల్‌లో కాలు జారిపడి కొట్టుకుపోయాడు. ఈ సంఘటన మండలం త్రిపురాపురం కొండకు సమీపంలోని బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో మంగళ వారం జరి గింది. ఈ సంఘటనకు సం బంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిరంగిపురంలో నివ సించే మహమ్మద్ తాజుద్దీన్, గుంటూరులోని సుభానీ హోటల్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం సెలవుదినడం కావడంతో తన స్వగ్రామ మైన పిడుగు రాళ్ళకు వచ్చాడు. తన స్నేహితులు నాదెండ్ల రవి చంద్ర, షేక్ జానీ బాషా, షేక్ అబూ బకర్‌లతో కలసి త్రిపురాపురం కొండ వద్దకు రంగు రాళ్ల కోసం వెళ్లారు. అక్కడ కొన్ని రాళ్ళను ఏరుకున్నారు. ఆ రాళ్లను శుభ్రంగా కడిగేందుకని అక్కడికి సమీ పంలో ఉన్న బెల్లం కొండ బ్రాంచ్ కెనాల్ వద్దకు తాజుద్దీన్ వెళ్లాడు. పాచి పట్టి ఉండటంతో కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన అతని స్నేహి తుడు రవిచంద్ర కెనాల్‌లో దూకి తాజుద్దీన్‌ను రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. కొంత దూరం వరకు రవిచంద్ర ఈత కొట్టుకుంటూ వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాజుద్దీన్(32) నీటిలో మునిగి పోయాడు. రవి చంద్ర ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. గల్లంతైన తాజుద్దీన్ కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. తాజుద్దీన్ భార్య, ఒక పాప ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం



రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి) : మండలంలోని కొత్తపలి సమీ పంలోని పొలాల్లో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహాన్ని రైతులు మంగళవారం ఉదయం గుర్తించారు. ఈ సమా చారాన్ని పోలీసులకు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ మణి కృష్ణ వివరాలు సేకరించారు. రూరల్ సీఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బురదలో కూరుకుపోయి ఉన్న మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440796247 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మిర్చియార్డు అధికారులకు సీఎం అభినందన

● రైతులకు ఉచిత భోజనంపై 'ఎక్స్' వేదికగా సందేశం



మిర్చి యార్డు అధికారులను అభినందిస్తూ 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు చేసిన పోస్ట్

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు (మార్కెటింగ్) అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అభినందిం చారు. ప్రస్తుత మిర్చి సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం భోజనం ఉచితంగా పంపిణీ చేస్తున్నందుకు 'ఎక్స్ 'వేదికగా సీఎం అభినందిస్తూ ఒక పోస్టు చేశారు. ఇదికాసేపట్లోనేవైరల్‌గా మారింది. భోజనంతో పాటు కేవలం రూ. 2 నామమాత్ర రుసుంతో సెంట్రలైజ్డ్ ఏసీ సదుపాయం కలిగిన విశ్రాంతి గదులను అందుబాటులోకి తీసు కొచ్చిన విషయాన్ని రైతు కడుపు చల్లగా' అనే శీర్షికతో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారం చేసిన కథనాన్ని చంద్రబాబు వీక్షించి తన స్పందనని ఎక్స్‌లో తెలియ జేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు తమని అభినందించడంతో మార్కెటింగ్ శాఖాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెగ్ మార్కింగ్ ప్రారంభం

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మండలం రావిపాడు వద్ద మంగళవారం నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు 167ఏ హైవే పనులు ప్రారంభమయ్యాయి. ముందుగా రావిపాడు సచివా లయంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. సభలో తాహశిల్దార్ కే వేణుగోపాలరావు, హైవే డీఈ శ్రీనివాసరావు, ఏఈ ప్రకాష్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. 167ఏ హైవే బాధితరైతులతో చర్చించారు.

1,15,612 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,20,808 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,15,612 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,694 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000
నెంబరు. 5	9000	13800
273	8500	13000
341	8000	15000
4884	7700	12500
సూపర్ 10	--	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	15000
బ్యాడిగి	7000	13000
దేవనూరు డీలక్స్	9000	13200
తెల్లకాయలు	4000	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	13500
నెంబరు.5	--	--
273	--	--
341	10000	11500
4884	--	--
సూపర్ 10	--	–
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	14000
బ్యాడిగి	9500	11000
దేవనూరు డీలక్స్	–	--
తెల్లకాయలు	5000	8500



- ఆకాశాన్ని తాకే వృక్షాలతో ఆహ్లాదకర వాతావరణం
- కాలనీ వాసుల ఆరోగ్యప్రదాయినిగా పబ్లిక్ పార్క్
- నిత్యం వందల మంది మహిళలు, వృద్ధులతో సందడి
- రాష్ట్రానికి రోల్ మోడల్‌గా.. మ్యాంగో స్ట్రీట్



వృద్ధుల మాటా మంతి

పల్లె వాసనలు, ప్రశాంత జీవనానికి ప్రతీక

ఎస్వీఎన్ కాలనీ

● మ్యాంగో స్ట్రీట్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు..

కాలనీ మెయిన్‌రోడ్డు, జేకేసీ కాలేజీ రోడ్డు మధ్య ఉన్న మ్యాంగో స్ట్రీట్ రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిచింది. ఆ వీధిలో ఉన్న వారందరూ సమ ష్టిగా ముందుకు వచ్చి విరాళాలు అం దజేసి జీఎంసీతో సమన్వయం చేసుకుని విశాలమైన సీసీ రోడ్డు నిర్మించారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభు త్వంతో సహకార శిరోమణి బిరుదు పొందిన నల్లమోతు వెంకటరత్తయ్య (ఏరిస్ రత్తయ్య) ఈ రోడ్డు నిర్వ హణ బాధ్యతలను చూస్తున్నారు. ఈ రోడ్డుపై 165 రకాల మామిడి మొక్కలు, దేవుడిని పూజించే పు ష్పాల మొక్కలను నాటారు. ప్రతి రోజూ వాటి బాగోగులను చూసేం దుకు రత్తయ్యతోపాటు మరికొంత మంది కమిటీగా ఏర్పడ్డారు. వారంతా కలిసి రహదారి శుభ్రతను పర్యవేక్షిస్తు న్నారు. దీంతో ఈ మ్యాంగో స్ట్రీట్ ఎకో ఫ్రెండ్లీ వీధిగా ప్రసిద్ధిగాంచింది. ఇలా నగరంలో ప్రతి బజారుకు ప్రజలు ముందుకు వస్తే అంతా సుందర నందన వనంగా మారుతుందని నిర్వా హకులు అంటున్నారు.



పార్కులో వ్యాయామం



గుంటూరు, కార్పొరేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యాభై మూడేళ్ల ఎస్వీఎన్ కాలనీ యశస్సు ఎంతో ప్రశస్తమైనది. స్వాతంత్ర్య సమరయోధులు, ఉన్నత విద్యావంతులు, పారి శ్రామికవేత్తలు మొదలు సామాన్య ప్రజల వరకూ అందరినీ అక్కున చేర్చుకుని ఆదరించింది. పట్టణంలోనే ఉన్నా పచ్చని చెట్లతో పల్లె వాతావర ణాన్ని పంచి కాలుష్యపు కోరల బారిన పడకుండా ఐదు దశాబ్దా లుగా ప్రజలను కాచుకుంటూ వచ్చింది. అందరికీ మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించింది.

● నగరంలోనూ.. ప్రశాంత జీవనం

ఎస్వీఎన్ కాలనీ ప్రశాంతతకు ప్రతీక. గుంటూరు నగరంలో ఉన్నప్పటికీ అక్కడ ఎంతో ప్రశాంతమైన వాతావరణం కనిపిస్తుం టుంది. ఆధునిక యుగపు నగరీకరణ, అపార్టుమెం ట్లు కాలనీలో ఉన్నప్పటికీ.. పాతతరం పల్లె వాసనలు ఉండటం కాలనీ ప్రత్యేకత. నగరా న్ని ముంచేసిన జనసంద్రం, వాహనాల రద్దీ అక్కడ అంతగా కనిపించదు. ఇరుకైన రోడ్లు, మురుగు కాల్వల దుర్వాసన ఉండదు. నగర శివారు ప్రాంతం కావడమో లేక.. ప్రణాళికా యుత ప్రాంతం కావడమో కారణం ఏదైతేనేమి.. నగరాన్ని మింగేసిన కాలుష్యపు కారు మబ్బులు, చెవులు చిల్లులు పడే రణగొణ ధ్వనులు ఇంకా ఆ కాలనీ దరిచేరలేదు. ఇటీవల కాలంలో జనసాంద్రత పెరుగుతు న్నప్పటికీ కాలనీ స్వరూపం మారకపోవడం విశేషమనే చెప్పాలి. కాలనీ ఏర్పాటు సమయంలోనే విశాలమైన రహదారుల నిర్మాణం, మొక్కలు నాటడం నేటికి కలిసి వచ్చిన అంశమని చెప్పవచ్చు.

● ఆరోగ్య వనం..

కాలనీ నడిబొడ్డులో దాదాపు రెండున్నర ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేశారు. తొలి నాళ్లలో పార్కుకు అంతగా ప్రాధాన్యం ఇవ్వ కపోయినప్పటికీ.. రెండో తరం పెద్దలు పార్కు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పార్కును అందమైన నందనవనంలా తీర్చిదిద్దారు. చిన్న పిల్లలు మొదలు.. పండు వృద్ధుల వరకూ, ప్రత్యేకించి మహి ళల వ్యాయామానికి ఉపయో గపడేలా చర్యలు చేపట్టారు. ప్రతి రోజూ వందల మంది వాకర్స్ ఈ పార్కులో నడక సాగి స్తుంటారు. కాలనీ చుట్టుపక్కల ఉన్న వికాస్‌నగర్, నలందనగర్, సిద్ధార్థనగర్, నవభారత్‌నగర్ నుంచి కూడా ఇక్కడికి వచ్చి వ్యాయామం చేసుకుంటారు. తద్వారా వారికి ఆరోగ్యంతోపాటు, ఆత్మీయ అనుబంధాలు ఏర్పడుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి పక్కన ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలు

కూటమి విజయాలు అందరికీ తెలియాలి : ఆలపాటి

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొలి ఆరునెల ల్లోనే సాధించిన విజయాలు, అభివృద్ధిని గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయా ల్సిన బాధ్యత కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలదేనని ఉమ్మడి కృష్ణ- గుంటూ రు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ను కాంక్షిస్తూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల కూటమి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆలపాటితోపాటు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, జనసేన జిల్లా అధ్య క్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన మూకలు తోకలెందుకు ముడిచాయి? : కనపర్తి



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి పాలన లో రెచ్చిపోయి మొరిగిన వైసీపీ మూకలు ఇప్పుడెందుకు తోక ముడిచాయో సమాధానం చె ప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించా రు. అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ ఎర్రబుక్‌కు నా కుక్క కూడా భయపడదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు ఆరోగ్యం గురించి మరోసారి మాట్లాడితే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో అడకా శ్రీనివాసరా వు, కార్పొరేటర్లు పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను నిలదీసిన యువగళం

● టీడీపీ నేత నిమ్మల శేషయ్య



గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచ కాలు, దుర్మార్గపు పాలన ను నిలదీసిన యువగళం పాదయాత్ర తొలి అడుగు పడి రెండేళ్లు పూర్తయిందని టీడీపీ నేత నిమ్మ ల శేషయ్య అన్నారు. ఆ మేరకు ఆయన మం గళవారం ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అరాచకాలతో ఎంతో మంది పేదలు, మహిళ లు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడి, మానసిక క్షోభకు గురవడాన్ని గుర్తించిన యువనేత లోకేశ్ 2023 జనవరి 27న పాద యాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలోని అనేక మారుమూల గ్రామాల్లో పర్యటించి, అక్కడ ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసు కున్నారు. యువగళానికి అప్పటి ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టించినా వెన్ను చూపకుండా ముందుకు సాగి నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మూలస్తంభంలా నిలిచారన్నారు.

ట్రేడ్ లైసెన్సులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 28(ఆంధ్ర జ్యోతి): గుంటూరు నగరంలో వార్డు సచివాల యాల వారీగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, తమ రోజు వారీ పర్యటనల్లో ట్రేడ్ లైసెన్స్‌లను కూడా తనిఖీ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీని వాసు లు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ వసంతరాయపురం, శారదాకాలనీ, రెడ్డి పాలెం, ఇన్నర్ రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి, మస్టర్ పాయింట్స్ తనిఖీ, పారి శుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి ఇంజినీ రింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, డీఈఈలు కళ్యాణ రావు, రమేష్‌బాబు, ఏసీపీ మల్లికార్జున, ఆర్‌వో రవి కిరణ్‌రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీయాలి

● సిరిపురపు శ్రీధర్

గుంటూరు సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. మంగళవారం గుంటూరులోని బ్రాహ్మణ చైతన్య వేదిక కార్యాలయంలో చలపతి కళా శాల విద్యార్థులు రూపొందించిన సినీ రీమేక్ వీడియో పాటను ఆయన ఆవిష్కరించారు. శ్రీధర్ మాట్లాడుతూ 'గుంటూరు మిర్చి' సంస్థ పేరుతో నూతన రాజధాని ప్రాంతాల్లో షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహిస్తూ తమ ప్రతిభా పాటవాలను విద్యార్థులు చాటుకుంటున్నారన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

గుంటూరు(తూర్పు) జనవరి 28(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదే శాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా సోమవారం కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎం లు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ నాగలక్ష్మి తనిఖీ చేశారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమా పక పరికరాలను, సిబ్బంది లాగ్‌బుక్‌ను పరిశీ లించారు. అగ్నిమాపక పరికరాలపై కాల పరి మితి ముగుస్తున్న నేపథ్యంలో చర్యలు తీసు కోవాలని డీఎఫ్‌వోని ఆమె ఆదేశించారు.

జిల్లాలో తగ్గుతున్న కుష్టు వ్యాధిగ్రస్తుల సంఖ్య

● డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి వెల్లడి



సమీక్షలో డీఎంహెచ్‌వో, సెంట్రల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

గుంటూరు మెడికల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తు ల సంఖ్య క్రమేపీ తగ్గు తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వే కార్యక్ర మాన్ని పరిశీలించేందుకు సెంట్రల్ మానిటరింగ్ బృందం మంగళవారం జిల్లాలో పర్యటించింది. ఈ సెంట్రల్ మానిటరింగ్ టీమ్‌లో తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టు జిల్లా నుంచి డిప్యూటీ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ ఏఆర్ రంగనాథ్, మెడికల్ కన్సల్టెంట్ నేషనల్ లెప్రసీ ఇరాడికేషన్ ప్రోగ్రాం (చెన్నై) డాక్టర్ అక్షత్ పురోహిత్ జిల్లా కు పరిశీలకులుగా వచ్చారు. వీరితో మంగళవారం సమావేశమైన డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి లెప్రసీ సర్వే తీరును వారికి వివరించారు. ఈనెల 20 నుంచి జిల్లాలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే కార్యక్రమం ప్రారంభమైందని, ఫిబ్రవరి రెండు వరకు సర్వే కొనసాగుతుందని ఆమె తెలిపారు. డిప్యూటీ జనరల్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ జిల్లాలో సర్వే యాక్టివిటీస్ సంతృప్తికరంగా జరుగు తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మానాయక్ భూక్య, డాక్టర్ సోమ్లానాయక్, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

అత్యాధునిక చికిత్సలతో కవలలను సంరక్షించిన వైద్యులు

● ఆరోగ్యంగా చిన్నారులు



కోలుకున్న కవలలు

గుంటూరు (మెడికల్) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆ కవలలు నెలలు నిండకుండానే జన్మించారు. ఒకరు 610 గ్రాములు, మరొకరు 640 గ్రాములు బరువే ఉన్నారు. అరచేతిలో ఇమిడిపో యేలా ఉన్న ఈ నవజాత శిశువులను సంరక్షించడం వైద్యులకు సవాల్‌గా మారింది. కనుమూరి హాస్పిటల్స్‌లో వెల్‌బేబీ క్లినిక్‌లో నియోనేటాలజిస్ట్ డాక్టర్ అడుసు మిల్లి, శిశు వైద్యనిపుణులు ప్రియాంక, పసికందులను కంటికి రెప్పలా కాపాడారు. ఇన్‌హేలేషన్ నైట్రిక్ ఆక్సైడ్, ఆటోమేటెడ్ టోటల్ బాడీకూలింగ్, హైఫ్రీక్వెన్సీ వెంటిలేటర్ వంటి అధు నాతన విధానాలను వినియోగించారు. మూడు నెలల తర్వాత శిశువులు ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకోవడం, బరువు కూడా 2.30 కేజీలకు చేరడంతో మంగళ వారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. వివరాల్లోకి వెడితే.. గత ఏడాది అక్టోబరు 25న చిలకలూరిపేటలో హేమ అనే గర్భిణీకి 25వ వారంలో కాన్పు జరిగి ఈ కవలలు జన్మించినట్లు తెలిపారు. బరువు అతి తక్కువగా ఉండటంతో వీరిని వెంటనే గుంటూ రులోని కనుమూరి హాస్పిటల్స్‌లోని వెల్‌బేబీ క్లినిక్‌లో చేర్పించారు. 'సాధారణంగా ఇంత తక్కువ బరువు ఉన్న శిశువులు బతకడం కష్టం. ఒకవేళ బతికినా వారిలో అనేక లోపాలు ఉంటాయని అందరూ భావిస్తారు. తమ వైద్యశాలలో లెవల్-4 నియోనేటల్ ఐసీయూ ఉండటం, ప్రపంచస్థాయి వైద్యపరికరాలు అందుబాట్లో ఉండటంతో శిశువులను సంరక్షించినట్లు' డాక్టర్ అడుసుమిల్లి రాజా తెలిపారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి అతి తక్కువ బరువు ఉన్న పిల్లల్లో సంభవించే శ్వాసకోశ సమస్యల నిర్ధారణ, చికిత్సల కోసం అత్యంత చిన్నదైన నియోనేటల్ బ్రాంకోస్కోపీ తమ వైద్యశాలలో అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు.

కేర్ డెంటల్ కాలేజీలో 'ఏఐ' రీసెర్చ్ సెంటర్ ప్రారంభం



ఏఐ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వినయ్‌సింగ్

గుంటూరు మెడికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా గుంటూరులోని దంత వైద్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని కెనడాకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్‌సింగ్ కొనియాడారు. పొత్తూరులోని కేర్ దంత వైద్య కళాశాలలో సోమవారం నూ తనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సెంటర్‌ను ప్రొఫెసర్ వినయ్‌సింగ్‌తో పాటు డాక్టర్ షబ్బీర్ అమానుల్లా, రూపేష్ ఆదిమూలం, ప్రదీప్‌సింగ్ కుందిలు ప్రారం భించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్‌ను వారు అభినందించారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా భావించి ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. నగరంలోని నెహ్రూనగర్ గోసంరక్షణ సంఘం గోశాలలో మంగళవారం జరిగిన నట్టల నివారణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో 656 ఆవులకు, 155 దూడలకు నట్టల నివారణ మందు తాగించినట్లు డిప్యూటీ వెటర్నరీ పాలీ క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రత్నజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఓ నరసింహారావు, డివిజనల్ డీడీ కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర జంతు సంరక్షణ సంఘ అధ్యక్షులు శివరాం, నెహ్రూనగర్ గోసంరక్షణ సంఘం వైస్ ప్రెసిడెంట్ యార్లగడ్డ వీరశేఖర్, కార్యనిర్వాహణ కార్యదర్శి రాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాటిబండ్ల బలరాం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

● విజ్ఞాన్స్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ నాగభూషణ్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వీసీ నాగభూషణ్

గుంటూరు (విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులు అందరూ రక్తదానానికి పూనుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థులు రక్తదానం చేశారు. యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగం, గుంటూరు జీజీహెచ్, నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అంద జేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సెలవు పెట్టుకునే హక్కు లేదా? : ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించిన నిబంధనల మేర కు ఉపాధ్యాయులు సెలవు పెట్టుకునే హక్కు లేదా అని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు జిల్లా విద్యా శాఖ అధికారులను, పౌరసరఫరాల శాఖా మంత్రిని ప్రశ్నించారు. తెనాలిలోని ఎన్ఎస్ ఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలని సందర్శించిన పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించి మొత్తం 24 మంది టీచర్స్‌కి గాను అనారోగ్య, అత్యవసర కారణాలతో నిబంధనల మేరకు ఏడుగురు సెలవులు పెడితే ప్రధా నోపాధ్యాయులను అందరి ముందు ఎలా అనుమతి ఇచ్చారని దబాయించడం, వీడియో తీసి వైరల్ చేయడాన్ని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుంది.

భారతీయ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శనీయం

● దత్త పీఠాధిపతి, శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ



గుంటూరు(తూర్పు), జనవరి 28(ఆంధ్రజ్యోతి): భారతీయ ఆధ్యాత్మిక, శాస్త్రీయ జీవన విధానం ప్రపంచానికి ఆదర్శనీయమని దత్త పీఠాధిపతి, శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. దత్త క్షేత్ర నాదయాత్ర 2025లో భాగంగా స్థానిక చౌడవరం దత్తనాధ క్షేత్రంలో ఆయన పర్యటించి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిత్య పూజలు, గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం, ఆంజనేయ రాగసాగరనాద ధ్యాన చికిత్స కచేరి నిర్వహించారు. అనం తరం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ మనిషి ఆధ్యాత్మికంగా వృద్ధి సాధించాలంటే ఆహార నియమాలను అదుపులో ఉంచుకోవాలి, సద్గురు బోధనల మీద నమ్మకం ఉంచి నడవడం, క్రియా యోగం నిత్యం సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గోపికృష్ణ, ట్రస్టీలు బీ సీతారామిరెడ్డి, డాక్టర్ వెంకటరత్నం, మిట్టపల్లి రాజేంద్రబాబు, వెంకటేశ్వరరెడ్డి, వీడీ గాంధీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శారదా కాలనీ 9వ లైనుకి చెందిన తిరుమలశెట్టి శివపార్వతి (58) ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె 4 సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధ పడుతోంది. విజయవాడలో చికిత్స పొందుతోంది. 26న తెల్లవారు జామున కిటికీకి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబసభ్యులు గమనించి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ 28న తెల్లవారుజామున మరణించినట్లు మృతురాలి కుమారుడు తిరుమలశెట్టి కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్ వినుకొండే లక్ష్యం

ఇళ్లలోకి వర్షపు నీరు



చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్లలోకి మురుగు నీరు వస్తుంది. గుంటి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి మురుగునీరు పెద్ద మసీదు మీదగా మార్కాపురం రోడ్డుకు ప్రవహించాలి. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. ఎవరికైనా బాగలేకపోయినా అంబు లెన్స్ కూడా రావడానికి సరైన మార్గం లేదు. సమస్యలపై గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు చెప్పినా ఫలితం లేదు. కనీసం మీరైన మా బాధను అర్థం చేసుకొని రోడ్డు సౌకర్యం కల్పించాలి.

-పఠాన్ కరీంబీ

తాగునీరు అందడం లేదు



ఆయుబ్‌ఖాన్ ఇంటి వెనుక బజారకు ప్రధాన రహదారికి ఎత్తులో ఉండడంతో తాగునీరు అందడం లేదు. నీటి కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దనే ఉండాల్సి వస్తుంది.

- షేక్ ఆయూషా

మౌలిక వసతులు కరువు



మున్సిపాల్టీకి పన్నులు చెల్లిస్తున్నాం. కాని మా ప్రాంతంలో మౌలిక వసతులు ఏర్పాటుచేయలేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆంధ్రజ్యోతి చొరవతో అయినా తమకు మౌలిక వసతుల ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలి.

- గంగినేని రాఘవ, గాయత్రీనగర్

పనులు చేపట్టాలి



గాయత్రీనగర్‌లో తాగునీటి సరఫరా కోసం చేపట్టిన రెండు ట్యాంకు నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆ పనులు చేపడితే మా ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. వెంటనే ట్యాంకు పనులను చేపట్టాలి.

-కంచుమాటి వీరాంజమ్మ

రూ.159 కోట్ల పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు

3000 గృహాల నిర్మాణం.. పేదలకు నివేశ స్థలాల పంపిణీ

అక్షరం అండ.. పరిష్కారమే అజెండా వేదికగా జీవీ హామీలు

వినుకొండ, నరసరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ వినుకొండే లక్ష్యం. చుట్టపక్కల ప్రాంతాలను విలీనం చేసి వినుకొండను మహా పట్టణంగా తీర్చి దిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను. రూ.159 కోట్ల వ్య యంతో నిలిచిపోయిన తాగునీటి పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తా. ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం. 3000 గృహాలు నిర్మిస్తాం. పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేస్తాం.' అని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు తెలిపారు. గాయత్రీనగర్‌లో పర్యటన అనంతరం ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా వేదికపై జీవీ ప్రసంగించారు. వీధుల్లో పర్యటన, ప్రజల నుంచి అర్జీల స్వీకరించిన అనంతరం ఆయా సమ స్యలపై ఆయన స్పందిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా మని భరోసా ఇచ్చారు. వినుకొండలో అక్షరం అండగా.. పరిష్కా రమే అజెండాగా.. కార్యక్రమాన్ని నిర్వహించినం దుకు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని 23, 31 వార్డుల్లో అధికారులతో కలిసి జీవీ పర్యటించగా పలువురు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి

సమస్యలపై వినతిప త్రాలు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను జీవీతో పాటు అధికారులకు ప్రత్యక్షంగా చూపారు. మున్సి పల్ అధికారులను, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను తమ వద్దకు నేరుగా తీసుకొచ్చి సమస్యల పరిష్కార వారధిగా నిలిచినందుకు కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. తాము ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరిస్తామని జీవీ హామీ ఇవ్వడం ఎంతో సంతో షంగా ఉందన్నారు. సమస్యలపై బాధితుల అభిప్రాయాలు.



31వార్డుల్లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రోడ్లు తవ్వి వదిలేశారు



23వ వార్డులో వార్డుల్లో సమస్యలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

23వ వార్డులో పెద్ద మసీదు బజారు వరకు గత ప్రభుత్వ హయాంలో పైపులైన్ల మరమ్మతులు పనుల కోసం సిమెంట్ రోడ్లు, కాల్వలను తవ్వేశారు. పూర్తిగా ధ్వంసం చేశారు. పైపులైన్ల మరమ్మతుల అనంతరం రోడ్లు, కాల్వలను బాగు చేయకుండా వదిలేశారు. రోడ్లు, కాల్వలను బాగు చేసి ఇబ్బందులను పరిష్కరించాలని అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడ్ని, అధికారులను ఎన్నిసార్లు కోరినా పొంతనలేని సమాధానాలతో తప్పించుకున్నారు.

-పఠాన్ ఖాశింఖాన్‌బజారు నివాసితులు

అభివృద్ధి పనులు జరగలేదు

31వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం నుంచి మున్సిపాల్టీకి అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నాం. పన్నుల చెల్లింపులో మేము ముందున్నాం. కాని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీధిలైట్లు వెలగడం లేదు. వెంచర్ నిర్వాహకులు వేసిన సీసీ రోడ్లు తప్ప మున్సిపాల్టీ నుంచి ఒక్క రూపాయతో అభివృద్ధి పనులు జరగలేదు. తాగునీరు అందని పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

-లక్ష్మీపురంవాసులు



31వార్డుల్లో స్థానిక ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న జీవీ ఆంజనేయులు

గత ప్రభుత్వంలో ప్రచార్భాటమే..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ధాన్యం సేకరణ విషయంలో ప్రతి గింజా కొంటామనే ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది తప్ప అన్నదాతలను ఆదుకోలేదని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మంత్రులు గొట్టిపాటి, అనగానితో కలిసి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, పక్కన మంత్రులు గొట్టిపాటి, అనగాని

విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించిన ధాన్యం కేవలం 7,000 టన్నులేనని, జిల్లాలో ఇప్పటికే 57,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశామని, మరో 25,000 వరకు ప్రతిపాదనలు పంపామని, అన్నదాతల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులేస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వంలో మంచి చేయాలనే తపన లేకుండా పనిచేయడం వల్లనే రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో అర్జీలు వస్తున్నాయని మంత్రి అనగాని తెలిపారు. పరిష్కారం అవకాశం ఉన్నవాటి విషయంలో వెంటనే ఫలితం చూపెడుతున్నామని, దాదాపు 30 శాతం అర్జీల విషయంలో సాంకేతిక పరమైన చిక్కులు ఇమిడి ఉన్నందువల్ల చేయలేకపోతున్నామని అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామని, వాటిని పకడ్బందీగా, పారదర్శకంగా పరిష్కరించేలా అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి అనగాని అన్నారు. ధాన్యం కొనుగోలు ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడు జరగలేదని, గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన రూ.1800 కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం అనేది గతంలో ఎన్నడూ లేదన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన ఇబ్బందులను మొత్తం ప్రక్రియకే అంటగట్టే ప్రయత్నం చేయొద్దని మంత్రి గొట్టిపాటి సూచించారు.



ఎర్రబాలెం పోస్టాఫీసు వద్ద స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

తపాలా బలోపేతంపై దృష్టి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

మంగళగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖను ఆర్థికంగా బలోపేతం చేయడంపై దృష్టి సారించామని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కుంచనపల్లి, ఎర్రబాలెంలోని పోస్టాఫీసులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు, స్థానికులతో పెమ్మసాని చర్చించారు. తపాలా కార్యాలయాలను కాస్ట్ సెంటర్ నుంచి ప్రాఫిట్ సెంటర్లుగా మార్చేందుకు ఏయే చర్యలు తీసుకోవాలనే అంశమై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల జీతాలు, ఇన్సెంటివ్‌లు ఎలా అందుతున్నాయి.. ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని సిబ్బందిని మంత్రి ప్రశ్నిం చారు. తపాలా శాఖకు ప్రస్తుతం రూ.13 వేల కోట్ల మేర ఆదాయం వస్తుంటే ఖర్చులు రూ.35వేల కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులలో సంస్థను గట్టెక్కించేందుకు ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధితో శ్రమించి పని చేయాలని సూచిం చా రు. స్థానికులు కూడా మంత్రి పెమ్మసానితో మాట్లాడుతూ తపాలా శాఖ ఉన్నతికి పలు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు సత్యనారాయణ, అరుణ, ఆకుల ఉమామహేశ్వరరావు, తపాలా శాఖ సీపీఎంజీ ప్రకాష్, పోస్టల్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి, పోస్టాఫీసు సూపరింటెండెంట్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నుంచి విశాఖపట్నంకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలి

● డయల్ యువర్ డీఎంలో విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి విశాఖపట్నంనకు రాకపోకలు సాగించేందుకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలని గుంటూరు నగరానికి చెందిన మోహన్‌రావు డయల్ యువర్ డిపో మేనేజర్‌లో విజ్ఞప్తి చేశారు. గుంటూరు-2 డిపో మేనేజర్ డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గురు ప్రయాణికులు పలు అంశాలపై ఫోన్ చేశారు. మంగళగిరి నుంచి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి - గుంటూరుకు ఉదయం 8.20 గంటల నుంచి 9.20 గంటల వరకు బస్సులే లేవని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డీఎం స్థానిక మంగళగిరి డీఎంకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. అలానే గుంటూరుకు చెందిన జ్ఞానయ్య గుంటూరు నుంచి జూబ్లీ బస్టాండ్‌కు, మేడ్చల్‌కు బస్సులు నడపాలని కోరారు.

నేడో.. రేపో పోలీస్ కార్యాలయానికి డీజీపీ

ఇంటిగ్రేటెడ్ సీసీటీఎన్ఎస్... సీసీ కెమెరాల సంపూర్ణ పర్యవేక్షణ విభాగాల ఆవిష్కరణ

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ, కేసుల ఛేదనకు సాంకేతిక పరిజ్ఞానం దిశగా పోలీస్ శాఖ మరింత చేరువ అవుతుంది. దీనికి సంబంధించి పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన సీసీ టీఎన్ఎస్ ప్రాజెక్టుతో పాటు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించి సంపూర్ణ పర్యవేక్షణ విభాగాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆవిష్కరించబోతున్నారు. ఇందుకుగాను ఆయన బుధ లేదంటే గురువారాల్లో నగరానికి రానున్నారు. గుంటూరు నగరానికి చెందిన ద్వారక తిరుమలరావు డీజీపీగా ఉన్నారు. ఆయన ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సొంత గడ్డపై చివరిసారిగా అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొనబోతున్నారు. పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఆయా అభివృద్ధి కార్యక్రమాలను డీజీపీ ఆవిష్కరించబోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సిసిటిఎన్ఎస్ విధానం అమల్లో ఉంది. పోలీస్ స్టేషన్లో నమోదయ్యే ఎఫ్ ఐ ఆర్ లు మొదలు, నిందితుల వివరాలు అలాగే నేరస్తులు, రౌడీ షీటర్లు, తీవ్రవాదులు, మావోయిస్టులాంటి వారందరి ఫోటోలతో సహా డేటాను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేస్తున్నారు. సీసీ టీఎన్ఎస్ ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా ఏ నేరస్తుడి గురించైనా చిటికెలో తెలుసుకునే సౌలభ్యం ఉంది. ముఖ్యంగా ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో డేటాను ఆ స్టేషన్ లో క్షణాల్లో తెలుసుకోవచ్చు. అయితే జిల్లాకు సంబంధించిన డేటాతో పాటు సీసీటీఎన్ఎస్ సంబంధించిన వివరాలను పోలీస్ కంట్రోల్ రూమ్ లో తెలుసుకునేందుకు కొంత జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అజాప్యాన్ని నిలువరించేందుకుగాను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాఫ్ట్వేర్ అప్డేట్ చేశారు. ఈ క్రమంలో ఇంటిగ్రేటెడ్ సీసీ టీఎన్ఎస్ విధానాన్ని డీజీపీ ఆవిష్కరించబోతున్నారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాలు అన్నింటిని ఒక్కొక్కటిగా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వాటితోపాటు ప్రైవేటు వ్యక్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటన్నింటినీ కూడా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా సీసీ కెమెరాలు కూడా అప్‌డేట్ చేస్తున్నారు. ఆయా సీసీ కెమెరాలన్నింటికి వాయిస్ కమాండ్ ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.75 నుంచి 80 లక్షల వరకు నిధులు కేటాయించబోతోంది. ఈ క్రమంలో డీజీపీ కంట్రోల్ రూమ్ లోని ఓవరాల్ మానిటరింగ్ సిస్టం కూడా ఆవిష్కరించబోతున్నారు.

చెన్నైలో కిడ్నాపైన బాలుడు సురక్షితం

ఐదుగురు నరసరావుపేట మహిళల అరెస్టు

ఈ నెల 12న సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిన్నారి అపహరణ

సీసీ కెమెరాల ఫుటేజ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఓ బాలుణ్ని కిడ్నాప్ చేసిన కేసులో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఐదుగురు మహిళల్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి చెర నుంచి ఆ బాలుణ్ని రక్షించారు. అసోంకు చెందిన సచితాబేగం తన ఆరేళ్ల కుమారుడు సకీబుద్దీన్‌తో కలిసి ఈ నెల 12వ తేదీన చెన్నై సెంట్రల్ స్టేషన్ చేరుకున్నారు. సుదూర ప్రయాణం చేసిన ఆమె అలిసిపోయి స్టేషన్‌లోనే బాలుడితో కలిసి నిద్రపోయారు. ఆమె నిద్ర లేచేసరికి సకీబుద్దీన్ కనిపించలేదు. దీంతో సచితాబేగం పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. ఆ బాలుణ్ని ఓ మహిళా ముఠా ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. స్థానిక వ్యాసర్పాడి పోలీసుస్టేషన్ వద్ద నమోదైన సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా బాలుణ్ని కిడ్నాప్ చేసింది చెన్నైలో బిక్షమెత్తుకుంటున్న మహిళా ముఠా అని గుర్తించారు. అనంతరం ఈ నెల 26న నరసరావుపేట వెళ్లిన పోలీసులు.. సరస్వతి, సత్యవతి, వీర అంజమ్మ, ఉమా, అంజమ్మ అనే ఐదుగురు మహిళల్ని అరెస్టు చేశారు. వారి చెరలో ఉన్న బాలుణ్ని రక్షించారు. ఈ ఐదుగురు మహిళలు గతంలోనూ ఇలాంటి కిడ్నాప్ ప్రయత్నాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.



చెన్నై పోలీసులు అరెస్ట్ చేసిన మహిళలు

పోలీసుల అండదండలతో జోరుగా కోడి పందాలు

రేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తీరంలో సంక్రాంతి పండుగ వెళ్ళినా రేపల్లె నియోజకవర్గంలో కోడిపందాలు జోరు మాత్రం తగ్గలేదు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల అండదండలు పుష్కళంగా ఉండటంతో జూద క్రీడలకు తీర ప్రాంతం అడ్డాగా మారింది. కోడిపందాలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం అడవులదీవి, దిండి మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని జోరుగా కోడిపందాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని పందెం రాయుళ్ళతోపాటు కృష్ణ, బాపట్ల జిల్లాల నుంచి పందెంరాయుళ్ళు వేలాదిగా తరలి రావటంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. మంగళవారం భారీగా బరులను ఏర్పాటు చేసి జోరుగా కోడిపందాలు నిర్వహించారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం రాజకీయ నాయకుల ఆదేశాలకు తలొగ్గి తమ కేమీ పట్టనట్లు మిన్నకుండి పోతున్నారు. దీంతో పందెం రాయుళ్ళు లక్షలాది రూపాయలతో పందాలు కాయడం, జనం పెద్ద సంఖ్యలో ఈ పందాలను వీక్షించారు. వేలాది మంది కోళ్ళు పట్టుకుని పందాలు వేసేందుకు తరలి వచ్చారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరిల్లో జోరుగా కోడిపందాలు నిర్వహించారు. కోడిపందాల రాయుళ్ళు ఒక్కసారిగా గ్రామంలోకి చేరుకోవటంతో వందలాది ద్విచక్ర వాహనాలు ప్రత్యక్షమై ఇసుకవేస్తే రాలనంత జనంలో కోలాహలంగా పందాలు సాగాయి. కోడి పందాల బరుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు బరుల వద్దే జరిగాయి. నిర్వాహకులు కమీషన్ల రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని తీర ప్రాంతవాసులు కోరుతున్నారు.



అడవులదీవి పంచాయతీ శొంఠివారిపాలెంలో కొనసాగుతున్న కోడిపందాలు

చోరీలతో హడలెత్తిస్తోన్న దొంగల అరెస్టు

- ఇద్దరూ కడప జిల్లా వాసులే..

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరుస చోరీలతో హడలెత్తిస్తోన్న కడప జిల్లాకు చెందిన ఇరువురు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 28 లక్షల ఖరీదైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన



రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ తదితరులు

దొంగతనాల కేసులకు సంబంధించి సీసీఎస్ పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వీరిలో కడప జిల్లాకు చెందిన ఆకుల శ్రీను, మహేష్‌లతో పాటు తమిళనాడు రాష్ట్రం వెల్లూర్ జిల్లా పెర్నంభట్టు మండలం పన్నీర్‌కొట్టై గ్రామానికి చెందిన చంద్రన్ అనే వారు జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం పాత రాజీవ్ గృహకల్ప, అడవితక్కెళ్ళపాడులో ఉంటున్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆకుల శ్రీను, కడప జిల్లా గుమ్మడిన్నె మండలం అశ్వతు గారి పల్లె గ్రామానికి చెందిన నాగ దాసరి మహేష్ అనే ఇరువురిని ఆరు చోరీ కేసుల్లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 28 లక్షల ఖరీదైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఆకుల శ్రీను అనే వ్యక్తి పై రాష్ట్రంలోనీ పలు జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 50కి పైగా కేసులు నమోదయ్యాయన్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ కూడా ఉందన్నారు. అలాగే నాగ దాసరి.మహేష్ అను వ్యక్తి మీద కూడా రాష్ట్రంలోనే వివిధ పోలీస్‌స్టేషన్లో సుమారుగా 35 కేసులు ఉన్నట్లు తెలిపారు. చంద్రన్ అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులు ఛేదించడంలో కృషి చేసిన క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, సిసిఎస్ డిఎస్పి శివాజీ రాజు , సీఐలు సుబ్బారావు, బత్తుల శ్రీనివాసరావు, అల్తాఫ్ హుస్సేన్ వారి సిబ్బందినీ అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందించారు.

గోరింకల సందడి



గోరింక.. సందడి.. గాల్లో ఎగురుతూ కరెంటు వైర్లపై కలిసికట్టుగా వాలిన అద్భుత దృశ్యం చూపురలను కట్టిపడేసింది. స్థానిక పత్తిపాడు రోడ్డులోని పొలాల్లో గింజలు తినేందుకు భారీ సంఖ్యలో గోరింక పక్షులు వచ్చాయి. ఇక్కడ విద్యుత్ వైర్లపై బారులు తీరిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. రోడ్డుపై వాహన శబ్దాలకు భారీ సంఖ్యలో పక్షులు గాల్లో ఎగురుతూ ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కరించాయి.

- ఆంధ్రజ్యోతి గుంటూరు



పశుపోషకులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం

గుంటూరు సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సరళిలో పాడి పశువుల పెంపకంపై పశు పోషకులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఈ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. గుంటూరు పశువైద్యశాల ఆవరణలో ఉన్న ప్రాంతీయ పశుసంవర్థక శిక్షణ కేంద్రంలో ఈ తరగతులు జరుగుతాయని తెలిపారు. తుళ్ళూరు, మంగళగిరి, చేబ్రోలు, తాడికొండ, తెనాలి, దుగ్గిరాల, ప్రత్తిపాడు, పెదనందిపాడు, పొన్నూరు మండలాలకు చెందిన పశుపోషకులు స్థానిక పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి నరసింహారావు తెలిపారు.

30న జాబ్ మేళా

గుంటూరు(విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న మంగళగిరి, ఫిరంగిపురం ప్రాంతాల్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొండా సంజీవరావు మంగళవారం ప్రకటన తెలిపారు. మంగళగిరిలోనే వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల, ఫిరంగిపురంలోని లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ సర్వీసెస్, (ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో జరిగే ప్రాంతాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలని పది, ఇంటర్ డిగ్రి ఫార్మసీ, పీజీ వరకు ఏదైనా విద్యార్హతలు ఉండాలని సూచించారు. వివరాలకు 9347372996లో సంప్రదించాలని సూచించారు.

గండాలయస్వామి భక్తులకు సూచనలు

మంగళగిరి సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంగళగిరి పర్వత శిఖరంపై ఉన్న శ్రీ గండాలయస్వామిని దర్శనార్థం వచ్చే భక్తులకు ఆలయ భక్తబృందం కొన్ని సూచనలను చేసింది. గండాలయస్వామి సన్నిధిలో ముఖమండప నిర్మాణపనులు జరుగుతున్న సందర్భంగా అక్కడ నూనె పోసే సదుపాయం చాల పరిమితంగా ఉన్న విషయాన్ని భక్తులు గమనించాలని భక్తబృందం విజ్ఞప్తి చేసింది. 29వ తేదీ అమావాస్యను పురస్కరించుకుని గండాలయస్వామి సన్నిధికి వచ్చే భక్తులు వంద నుంచి రెండొందల గ్రాముల పరిమితి ఉన్న నూనెను మాత్రమే వెంట తెచ్చుకోవాలని కోరింది. అలాగే ఘాట్‌రోడ్డుపై వచ్చే భక్తులు ఒక్కో బైకుపై ఒక్కరు వంతున మాత్రమే రావాలని, టర్నింగ్‌లవద్ద లాంగ్ టర్నింగ్‌లు తీసుకోవాలని జ్వాలా నృసింహస్వామి భక్తబృందం విజ్ఞప్తి చేసింది.

శబ్దాలతో ఇబ్బందులు కలిగిస్తే కఠినచర్యలు : కమిషనర్

మంగళగిరి సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇష్టానుసారం బైకుల మోత, టపాసులను కాల్చి భారీ శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులను కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎంటీఎంసీ కమిషనరు షేక్ అలీంభాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పబ్లిక్, ఇండస్ట్రియల్, ప్రాంతాల్లో 10 డెసిబుల్స్, ప్రైవేటు ప్రాంతాల్లో అయిదు డెసిబుల్స్ వంతున శబ్దాలను మాత్రమే పాటించాలని సూచించారు. ఆస్పత్రులు, విద్యాసంస్థలు, కోర్టుల ప్రాంతాల్లో వంద మీటర్ల వరకు సైలెన్స్ జోన్లుగా నిర్ణయించామన్నారు. అంటే ఈ ప్రాంతాల్లో శబ్దకాలుష్యాన్ని, బాణసంచా కాల్పులను పూర్తిగా నిషేధించామన్నారు. ఇకమీదట నగర ప్రాంత ప్రజలందరూ ఈ నిబంధనలను పాటించాలని కోరారు. నిబంధనలను అతిక్రమించినవారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాజధానిలో పోలీసుల విస్తృత గాలింపు

తుళ్లూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల్లో ఈ నెల 26 రాత్రి దొంగతనాలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టినట్టు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు చెప్పారు. సీసీ ఫుటేజీలను పరిశీలించటంతో పాటు దొంగలు వినియోగించిన కారు నెంబర్‌ను తెలుసునేందుకు ప్రయత్నిస్తున్నామని త్వరలోనే దొంగతనాలకు పాల్పడిని వారిని పట్టుకుంటామని చెప్పారు. తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ రాజధాని గ్రామం రాయపూడిలలో ఒక ఇంట్లో భార్యభర్తలు నిద్రిస్తున్న సమయంలో దొంగలు ప్రవేశించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. దొండపాడు బోరుపాలెంలో జరిగిన దొంగతనాలు గురించి సీఐ ప్రస్తావించలేదు. రాజధాని నేపథ్యంలో అనేక ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులెవరైనా తారసపడితే 100, 112 లేదా 9440900860 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. రాజధాని గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచుతున్నామని సీఐ చెప్పారు.

నివేశన పట్టాలకై సంతకాల సేకరణ

మంగళగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్లకు పైగా చెరువు పోరంబోకు స్థలాల్లో పక్కా గృహాలను నిర్మించుకుని స్థిర నివాసం ఉంటున్న పేదలందరికీ అభ్యంతరాలను తొలగించి నివేశన పట్టాలను పంపిణీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. నగరంలోని రత్నాలచెరువు ఏరియాలో మంగళవారం సీపీఎం కార్యకర్తలు ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సేకరించిన సంతకాల చిట్టాను స్థానిక సచివాలయం అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, చంద్రారావు, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలి

గుండాలపాడు(ఫిరంగిపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలని గ్రామ సర్పంచ్ కాంద్రు దానయ్య అన్నారు. మంగళవారం గ్రామంలో జరిగిన పశు ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పీర్ అహమ్మద్ మాట్లాడుతూ పశువులకు, దూడలకు నట్టల నివారణ మందును ఇచ్చామన్నారు.

దుగ్గిరాల-చింతలపూడి మధ్య మెయిన్‌రోడ్డు మరమ్మతులు

● త్వరలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులు



చింతలపూడి సమీపంలో మెయిన్‌రోడ్ మరమ్మతు పనులు

దుగ్గిరాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల-నందివెలుగు మధ్య రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. నెలరోజుల క్రితం దుగ్గిరాల పాత లాకు నుంచి మోరంపూడి గ్రామం వరకు రోడ్డు గుంతలమయమై, అత్యంత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో నూతనంగా తారు రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేసిన విషయం విదితమే. ఎంతోకాలంగా వాహనదారుల పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు గానూ, త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. కాగా పాతలాకు నుంచి నందివెలుగు మధ్య రోడ్డు పరిస్థితి కూడా మరింత దయనీయంగా మారడంతో ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన రోడ్డుపై భారీ గుంతలను కంకర డస్ట్‌తో నింపి, తారువేయడం ప్రారంభించారు. రెండ్రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి కావచ్చునని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఇటీవల వారం రోజులుగా ఎడతెరపిలేని మంచు కారణంగా తరచూ జరుగుతున్న ప్రమాదాలతో, ఉదయాన్నే కార్యాలయాలకు, పట్టణాల్లో కూలి పనులకు వెళ్లే వాహనదారులు భయాందోళనల మధ్య ప్రయాణం కొనసాగిస్తూ వచ్చారు. ఐదేళ్లుగా నానా అవస్థలు పడుతూ, తరచూ ప్రమాదాల భారిన పడుతున్న వాహనదారులు మరమ్మతులు చేపట్టడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

లోన్ కోసం కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు

● వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళల ఆవేదన



మండల సమాఖ్య వద్ద సీసీ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డ డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మా పనులు మానుకుని లోన్ కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది.. ఉదయం పది గంటల నుంచి సీసీ వస్తారని ఎదురు చూస్తున్నాం.. ఇంత వరకు రాలేదు.. అంటూ డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయం మండలపరిషత్ కార్యాలయంలో ఉంది. ఈ కార్యాలయం వద్ద రసులిల్లి గ్రూపునకు చెందిన డ్వాక్రా మహిళలను వెంట బెట్టుకుని వీవోఏ కార్యాలయంకు వచ్చింది. సుమారు పదిహేను రోజుల క్రితం ఈ గ్రూపు లోన్ కోసం అన్ని రకాల అప్లికేషన్లు పూర్తి చేసుకుని ఉంది. అయితే లోన్‌కు సంబంధించి డాక్యుమెంటేషన్ మొత్తం సీసీ కూడా పరిశీలించాడు. అయితే సంతకం మాత్రం చేయలేదు. ఈ సంతకం కోసం ఆ గ్రూపునకు చెందిన డ్వాక్రా మహిళలు మండల సమాఖ్య కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. వాస్తవానికి సీసీలు గ్రౌండ్ లెవల్‌లో అన్ని పరిశీలించి అక్కడే సంతకాలు చేయాల్సి వస్తుంది. వివిధ కారణాలతో డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు మొత్తం కార్యాలయాల వద్దకు రావాల్సి వస్తుంది. ఇటీవల గొట్టిపాడుకు చెందిన డ్వాక్రా సంఘ సభ్యులు సీసీ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. ఆయన ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ కావడంతో ఏమి చేయాలో తెలియక ఏపీఎంను సంతకం పెట్టమని వేడుకున్నారు. అయితే తాను సంతకం పెట్టకూడదన్నాడు. దీంతో మహిళలు కన్నీటి పర్యంతమవుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకొని సంతకం మాత్రం పెట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాజాగా ప్రత్తిపాడుకు సంబంధించి డ్వాక్రా మహిళలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అధికారులు రకరకాల కారణాలు చెపుతూ వారిని రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. దీనివల్ల రోజువారీ కూలీకి దూరం కావాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న తెలుగుమహిళ నాయకులు

మంగళగిరి సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ సహకారంతో 80 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం ఈ కుట్టుమిషన్లను లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి లోకేశ్ అందిస్తున్న ఆర్థిక సహకారంతో నియోజకవర్గంలోని పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్త్రీశక్తి అనే కార్యక్రమాన్ని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ దఫా 68వ బ్యాచ్ కింద మొత్తం 80 మంది మహిళలు 60 రోజులుగా స్థానిక టీడీపీ కార్యాలయంలో శిక్షణ పొందారు. వీరందరికీ కుట్టుమిషన్లతో పాటు సర్టిఫికెట్లను కూడ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు లోకేశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ స్త్రీశక్తి అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని పేద మహిళలందరి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. ఉచితంగా కుట్టుమిషన్లను పొందిన మహిళలు వాటిద్వారా తమ కుటుంబ జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలని కోరారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, పట్టణ అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శి వాసా పద్మ, మండల అధికార ప్రతినిధి యలమంచిలి పద్మజ, అప్పల శాంతి, ఉడతా లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయాల్సిందే

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ

మంగళగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి తీరాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రావుల శివారెడ్డి కాంస్య విగ్రహాన్ని మంగళవారం రాత్రి సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన చంద్రబాబు ఇపుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనందున సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేమని చెప్పడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉండి డబుల్ ఇంజన్ సర్కారులు అంటూ.. అభివృద్ధిపథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెడతామంటూ ఇప్పటివరకు చెప్పుకొచ్చి- ప్రజలను మోసం చేయడం తగదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, హడ్కో నుంచి రుణాలు తీసుకువస్తూ జగన్మోహన్‌రెడ్డి మాదిరిగానే రాష్ట్రాన్ని అప్పుల పాల్జేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిందేనని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సభలో సీపీఐ జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు జేవీ రాఘవులు, వీవీ జవహర్‌లాల్, జొన్నా శివశంకరరావు, ఎస్ఎస్ చెంగయ్య, వైసీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు

లీడ్ బ్యాంకు డీఎం మహిపాల్‌రెడ్డి

వట్టిచెరుకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట సాగుదారు పత్రం కలిగిన కౌలు రైతులకు వ్యవసాయ పంట రుణాలు బ్యాంకుల ద్వారా పొందేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు లీడ్ బ్యాంకు డీఎం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో గుంటూరు జిల్లా లీడ్ బ్యాంకు జిల్లా వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పంటల సాగు హక్కుపత్రం కలిగిన కౌలు రైతులకు వ్యవసాయ పంట రుణాల మంజూరు విధివిధానాలపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో లీడ్ బ్యాంక్ డీఎం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కౌలు రైతులకు రుణాలు పొందేందుకు నిర్దేశించిన విధి విధానాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, ఏవో లక్ష్మి, ఉప్పుటూరి చినరాములు, రైతులు పాల్గొన్నారు.

ఉప్పుటూరి సేవా ట్రస్ట్ సేవలు నిరుపమానం

పుల్లగుడిగుంట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్ చౌదరి ప్రోత్సాహం, సహకారంతో ఏర్పడిన తన తండ్రి ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ ద్వారా రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందించటమే కాకుండా ట్రస్ట్ ద్వారా చేస్తున్న పలు కార్యక్రమాల నిర్వాహణ ప్రశంసనీయమని లాడ్ బ్యాంక్ డీఎం మహిపాల్‌రెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి ప్రశంసలు కురిపించారు. మంగళవారం రైతు నేస్తం ఫౌండేషన్‌లో జరిగిన పొలం పిలు స్తుంది కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పుటూరి చినరాములును డీఎం మహి పాల్ రెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావులు ఆయన సేవలకు గుర్తింపుగా శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఉప్పుటూరి చినరాములును సన్మానిస్తున్న రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, మన్నవ పూర్ణ

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



హెచ్ఎం, ఉపాధ్యాయులకు పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

దుగ్గిరాల జనవరి 28, ఆంధ్రజ్యోతి: పదోతరగతి విద్యార్థినులకు ఉపకరిం చే స్టడీమెటీరియల్‌ను దుగ్గిరాల జడ్పీ బాలికోన్నత పాఠశాలకు మంగళవారం అందించారు. మండల ఎస్టీయూ నాయకులు పాఠశాల హెచ్ఎంఎస్ శోభాదేవితోపాటు ఆరు సబ్జెక్టుల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు అందించారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్తీర్ణతాశాతం పెంచుకునేందుకు ఉపకరించే స్టడీ మెటీరియల్‌ను అందించిన ఎస్టీయూ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

రూ.19 లక్షల వ్యవహారంలో ఏవోపై ఎందుకంత ప్రేమ ?!

గుంటూరు సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు వస్తాయని అక్కడున్న వ్యవసాయ సిబ్బంది ముందే ఊహించారు. పంట నష్టపరిహారం ఎలా కొట్టేయాలో ప్రణాళిక రచించారు. లేని కౌలు రైతులను సృష్టించి.. వారి పేర్లతో కార్డులు సిద్ధం చేసి వరదల కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఇంతలో వరద వచ్చింది.. వాళ్ళ పంట పండింది. నకిలీ కౌలు రైతుల పేర్లతో రూ.19 లక్షలు వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారం బయటకు పొక్కటంతో కింది స్థాయి సిబ్బందిపై చకచకా చర్యలు తీసుకున్నారు. మేడికొండూరు మండలం యలవర్తిపాడులో ఈ ఉదంతం జరిగింది. అసలు బాధ్యులుగా ఉన్న మండల స్థాయి అధికారులపై చర్యలు తీసుకునే విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి సమీక్షలో అదే విషయం చర్చకు వచ్చింది. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మేడికొండూరు ఏవో వ్యవహారంపై మాట్లాడారు. పంట నష్టపరిహారం పక్కదారి పట్టిన వ్యవహారంలో అక్కడి వ్యవసాయాధికారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దానిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారిని విధుల నుంచి తప్పించామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారిపై చర్యల కోసం కమిషనర్‌కు నివేదిక పంపామని చెప్పారు. కమిషనర్ మాత్రమే వ్యవసాయ అధికారి మీద చర్యలు తీసుకోవాలని చెప్పారు.

క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలి

పెదనందిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వాటర్ ఎయిర్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిర్ ఇండియా వారు గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు, వ్యక్తిగత మరుగుదొడ్ల మరమ్మతులకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటిని క్వాలిటీ పరీక్షలు చేసుకునేందుకు కిట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాక్రమాలను గ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. వరగాని, రావిపాడు, ఏబీపాలెం, జీజీపాలెం గ్రామాలను వారు దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో వీఏఈ జిల్లా కోఆర్డినేటర్ ఎన్ నరేష్, అడ్మిన్ అధికారులు రంగసాయి, రాజేశ్వరి, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్స్ గోడౌన్ పరిశీలన



వీవీ ప్యాట్స్ గోడౌన్ భద్రతను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో లు

ఫిరంగిపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపూడిలో వ్యవసాయ మార్కెట్ యార్డు నందు భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ గోడౌన్‌ను గుంటూరు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజావలి తనిఖీ చేశారని తహసీల్దార్ జే ప్రసాదరావు మంగళవారం తెలిపారు. ప్రతినెల ఈవీఎంల గోడౌన్ భద్రతా ప్రమాణాలు తనిఖీల్లో భాగంగా జిల్లా అధికారులు పరిశీలించారని, ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ శ్రీమతి డీ అరుణకుమారి, అగ్నిమాపక అధికారి కే నవీన్‌సింగ్, విద్యుత్‌శాఖ వీ శ్రీరామమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ వీ శివకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెడ్ వితరణ

తాడికొండ(పొన్నెకల్లు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోగులు ఇబ్బందులు కలగకుండా ఉండేదుకు పొన్నెకల్లు పీహెచ్‌సీకి బెడ్‌ను తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ హుస్సేన్ జ్ఞాపకార్థం షేక్ కాలేషా వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చిన రోగులు విశ్రాంతి తీసుకోవటానికి సౌకర్యంగా ఉండేదుకు బెడ్‌ను ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ పీహెచ్‌సీ చైర్మన్ పాలేరు రమేష్‌బాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు నెల్లూరి కాంతారావు, పంచాయతీ సెక్రటరి షేక్ జానీ, వార్డు మెంబర్ షేక్ మొహిద్దీన్, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌లు

● జిల్లా సమీక్షలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాను శాశ్వతంగా అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జిల్లా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ మాఫియాను అడ్డుకునేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికి అరికట్టలేక పోతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేస్తే ఫలితాలు రావచ్చునని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తెలియజేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి రేషన్ మాఫియా విషయం తీసుకువెళ్లి కఠినచర్యలు తీసుకునే విధంగా చూడాలని కోరారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాల అందజేత



లోకేశ్‌కు విరాళాలు అందిస్తున్న దాతలు

మంగళగిరి సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేదలకు ఎన్నో విధాలుగా ఉపకరిస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణతోపాటు పేదల వైద్యసాయానికి తోడ్పడుతున్న ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు దాతలు విరాళాలను అందజేశారు. ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్ నివాసంలో మంగళవారం రాత్రి పలువురు దాతలు ఆయన్ను కలుసుకుని నగదు చెక్కుల రూపంలో విరాళాలను అందించారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు గాను ఏలూరుకు చెందిన గుత్తా వెంకటకృష్ణారావు రూ.50వేలు, గుత్తా శారదాదేవి రూ.50వేలు, గుత్తా స్వరూపారాణి రూ.లక్ష వంతున విరాళాలను అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన జొన్నలగడ్డ శేఖర్ రూ.పదివేల నగదు చెక్కును లోకేశ్‌కు అందజేశారు. కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన ఈ దాతలను మంత్రి లోకేశ్ అభినందించారు.

దళితులకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలి

తాడికొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని దళితులకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తాడికొండలోని దళిత కాలనీల్లో పర్యటించినప్పుడు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. కాలనీలో శ్మశాన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు వేల కుటుంబాలు కలిగిన దళితులకు 80 సెంట్ల స్థలంలో మాత్రమే శ్మశానం ఉందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థలాన్ని కేటాయిచాలని కోరారు. మురుగుపారుదల సరిగ్గా లేదని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేసి డ్రైనేజ్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పలు పాఠశాలల్లో ఎంఈవో తనిఖీ

కొల్లిపర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యనందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిడపర్రు, కొల్లిపర, పిడపర్తిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల ప్రగతిపై ప్రతి నెల తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ద వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



మాజీ మంత్రి ఆలపాటి

చరిత్రలో నిలిచిపోయిన యువగళం

● మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా రెండేళ్ల క్రితం వైసీపీ అరాచక పాలనపై గళం వినిపిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తూ నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర విశేషజనాదరణ పొంది చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని మాజీ మంత్రి, కృష్ణ, గుంటూరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో యువగళం రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ యువతకు జాబ్‌క్యాలెండర్ అంటూ నమ్మబలికి జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదలచేసి నిరుద్యోగులను నట్టేటముంచాడని విమర్శించారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలంటూ లేని ప్రేమను చూపుతూ వారి అభ్యున్నతిని గాలికి వదిలేశారని, అదేమని ప్రశ్నించిన వారిపై కేసులు, ఎదిరించిన వారిపై దాడులతో రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పాతరవేశారని ఆక్షేపించారు. నాసిరకం మద్యం, గంజాయి, దౌర్జన్యాలతో ప్రజలు ఆందోళన చెందుతున్న తరుణంలో మంచి రోజులు వస్తాయంటూ వారిలో భరోసా నింపేలా యువ నాయకుడు నారా లోకేశ్ యువగళం పాదయాత్రతో ప్రజల ముందుకు వచ్చి అందరికీ భరోసా కల్పించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లు ఆరు నెలల కాలంలో వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని భర్తీచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడుపుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని యువగళం పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తూ నిరుద్యోగ యువతకు భరోసాగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నన్నపనేని సుధాకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

31న శ్రీవాసవీ అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బోసురోడ్డులోని ఆలయ ఆవరణలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 102 గోత్రాల ఆర్యవైశ్య కన్యకలతో కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి యజ్ఞ గుండంలో సమిధలు సమర్పిస్తారు. సుప్రభాత సేవ, అలంకారం, అభిషేకం, అర్చన, హోమం నిర్వహిస్తారు. శోభాయాత్రలో పాల్గొనే కన్యకలు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పట్టణంలోని ఆర్యవైశ్యులంతా 31న మధ్యాహ్నం నుంచి వ్యాపార సంస్థలకు సెలవు ప్రకటించి ఊరేగింపులో పాల్గొనాలని తెలిపారు. మాలేపాటి హరిప్రసాద్, ఉప్పల వరదరాజులు, విశ్వేశ్వరరావు, గోపి, శ్రీనివాసరావు, హరికిషోర్, రఘునాథ గుప్తా, నూకల భాస్కరరావు, సాధుప్రతాప్, మద్దాళి శేషాచలం, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

తెనాలి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పినపాడుకు చెందిన మాలతి (23), నాజరుపేటకు చెందిన రమ్య ఇద్దరూ స్నేహితులు. గుంటూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రతిరోజు తెనాలి నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై రాకపోకలు చేస్తుంటారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా అంగలకుదురు-తెనాలి మధ్య తెనాలి నుంచి వస్తున్న శలపాడుకు చెందిన యువకుడు ద్విచక్రవాహంపై వస్తూ ఎదురుగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో మాలతికి తీవ్ర గాయాలు కాగా రమ్యకి యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను వడ్లమూడిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మాలతి పరిస్థితి విషమంగా ఉంది. మాలతి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.

ఐతానగర్‌లో స్త్రీల పండుగ

తెనాలి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని రక్షణసైన్యం ప్రార్థనా మందిరంలో మంగళవారం స్త్రీల పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నల్ సుమిత్రకు మందిర ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. 26సంఘాల స్త్రీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీయోనుకుమారి, రత్నసుందరి, రాజకుమారి, దైవసందేశం అందించారు.

అధ్వానంగా కొల్లిపర బస్టాండ్

● నిర్వహణ లేక అంతటా అంధకారం
● నీటి సౌకర్యం లేక అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
● పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



కొల్లిపర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నెలవుగా మారింది. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు లేక ఆధ్వానంగా దర్శనమిస్తోంది. 1993లో దాత భీమవరపు శేషిరెడ్డి స్థలాన్ని దానంగా ఇవ్వగా ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను నిర్మించారు. ప్రారంభ రెండేళ్లలో మౌలిక సౌకర్యాలు ఉన్నాయి. అనంతరం కాలంలో అనంతర కాలంలో బస్టాండ్ గురించి పట్టించుకున్న వారే లేరు. ఒకప్పుడు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడే బస్టాండ్ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెలవెలబోయింది. బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహణ సరిలేక కనీసం విద్యుత్ వెలుగులు కూడా లేకుండా పోయాయి. విద్యుత్ బల్బులు పూర్తిగా మాడిపోవడంతో బస్టాండ్ ఆవరణ అంధకారంగా మారింది. దీంతో రాత్రివేళ బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. విద్యుత్‌లేని కారణంగా రాత్రి సమయాల్లో మహిళలు బస్టాండ్‌కు వెళ్లాలంటేనే బయపడుతున్నారు. దీనికితోడు ప్రయాణికుల కనీస సౌకర్యార్థం ఉండాల్సిన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఊసే లేదు. ముఖ్యంగా మరుగుదొడ్లకు నీటి సరఫరా లేదు. పైగా తలుపులు పూర్తిగా పాడైఉన్నాయి. అసలు వాటిని శుభ్రపరిచే వారే లేరు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కి వెళ్లి బస్సు ఎక్కడాన్నే మానుకున్నారు.

బస్టాండ్ అధ్వానంగా మారిందని, వెంటనే ఆధునికీకరించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీకి తెనాలి డివిజన్ పరిధిలో అధిక ఆదాయం తెచ్చిపెడుతున్న కొల్లిపర రూట్ పట్ల తొలి నుంచి వివక్ష చూపుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌ని పూర్తిగా ఆధునీకీకరించాలని, తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, తాగునీరు సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నీటి వసతి లేక అధ్వానంగా తయారైన మరుగుదొడ్లు

సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తాం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
● 39, 40 వార్డుల్లో పర్యటన
● కమ్యూనిటీ హాల్ నిర్వహణపై అసహనం
● దోమలతో అల్లాడుతున్నామని ప్రజల ఫిర్యాదు



గోలిడొంకలో ఇంటి నిర్మాణాలను పూర్తిచేయాలని కోరుతున్న కాలనీవాసులు

తెనాలి మారీసుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిచేందుకు తగు చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన తెనాలిలో చేపట్టిన పాదయాత్ర రెండో రోజు మంగళవారం 39,40వ వార్డులలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మంత్రి ముందు సమస్యలను ఏకరవు పెట్టారు.. వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ముఖ్యంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని వాపోయారు. ఈ విషయంపై మంత్రి మనోహర్ ఆ వార్డులోని సచివాలయ శానిటరీ అధికారులను పిలిచి వారి అలసత్వాన్ని ప్రశ్నిస్తూ, వారిని సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. నివాస స్థలం కేటాయించి, ఇళ్లను నిర్మించాలని పలువురు కోరారు. ఐతానగర్‌లోని సచివాలయం సర్కిల్ ప్రాంతంలో పోకిరీల ఆగడాలు శృతిమించి ఉన్నాయని మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. తాగునీరు, పింఛన్లు, రేషన్ కార్డులు, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలపై పలువురు మంత్రికి విజ్ఞాపనలు చేశారు. ప్రజల సమస్యలన్ని సావదానంగా ఆలకించిన మంత్రి త్వరలోనే ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తొలిగా వార్డు పర్యటనకు వచ్చిన మంత్రి మనోహర్‌కు ఆ వార్డులోని మహిళలు, కూటమి నేతలు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ నాగవేణి, మునిసిపల్, ఇతర శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కమ్యునిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

పట్టణంలోని ఐతానగర్ ప్యాడిసన్ పేటలో మునిసిపాలిటీకి సంబంధించిన కమ్యునిటీ హాల్ గోడలు బీటలు రావడాన్ని గుర్తించి ప్రభుత్వ ఆస్తిని ఇంత నిర్లక్ష్యంగా వదిలేస్తే ఉపేక్షించేది మునిసిపల్ కమిషనర్ బండి శేషన్నపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కమ్యూనిటీ హాల్‌ని పూర్తి రక్షణగా, అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అదే ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పని చేయని ఆర్వో వాటర్‌ప్లాంట్‌పై ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. తక్షణమే ఆర్వోప్లాంట్ మరమ్మతులు చేయించి సురక్షిత నీరు అందించాలని సూచించారు.

అపార్టుమెంట్ వాసులతో సమావేశం

గోలిడొంకలోని ఎల్జీ హైట్స్ అపార్టుమెంట్ వాసులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోడ్డు, తాగునీటి సమస్యలను ప్రజలు ప్రస్తావించగా, వాటిని వేగంగా పూర్తి చేయాలని, మిగిలిన రోడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికసిద్ధం చేస్తామన్నారు.

నేలపాడు లే అవుట్‌లో కాంట్రాక్టర్ చేతివాటంపైఫిర్యాదు

నేలపాడు లేఅవుట్‌లలో ఇల్లు కట్టిస్తానని కాంట్రాక్టరు నాగిరెడ్డి ఒక్కొక్క ప్లాటుదారుని నుంచి రూ.35000 వసూలు చేసిన విషయంపై వార్డులోని మహిళలు మంత్రికి ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, బాధితులకు న్యాయం జరిగేలాచూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


అడ్డిమూల డొంక సమస్య పరిష్కరించరూ..

కొలకలూరులోని అడ్డిమూల డొంక సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ రైతులు మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందించారు. దుగ్గిరాల మండల పరిధిలోని దేవరపల్లి అగ్రహారంకి చెందిన తెనాలి మండలం కొలకలూరుకు రైతులు రాకపోకలు చేసే డొంక మార్గం 2.36సెంట్లు మేర ఆక్రమణనకు గురైందని, దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని మంత్రికి తెలిపారు. దీనిపై మంత్రి మనోహర్ స్పందించి తహసీల్దార్ గోపాలకృష్ణను పిలిచి సత్వరమే డొంక సమస్యను దుగ్గిరాల తహసీల్దార్‌తో కలిసి మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

రైతులకు ఎరువులు సక్రమంగా అందడం లేదు

సర్వసభ్య సమావేశంలో చర్చ





సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ చెన్నకేశవులు, జడ్పీటీసీ ఉమాప్రణతి, ఎంపీడీవో దీప్తి, అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ ఫణికుమార్

తెనాలి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సీజన్ ప్రారంభమై పంటలు సాగు ఊపందుకున్నా ఎరువులు సరిగా అందడంలేదని, సోమసుందపాలెంలో రైతులు ఎరువులకోసం పడిగాపులు కాస్తున్నారని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్నకేశవుల ధర్మరాజుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు వ్యవసాయశాఖ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు మొక్కజొన్న సాగుకు అవసరమైన ఎరువులను గ్రామ రైతుభరోసా కేంద్రాల్లో, సొసైటీలలో అందుబాటులో ఉంచాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. కొలకలూరు గ్రామం మీదుగా గుంటూరు- తెనాలి వెళ్లే పల్లెవెలుగు బస్సులు రాత్రి 7.30 దాటితే వాటి కోసం పడిగాపులు కాసే పరిస్థితి నెలకొందని ఎంపీటీసీ దోసపాటి నాగదీపిక ఆర్టీసీ అధికారులను నిలదీశారు. ఎంపీటీసీ కాళిశెట్టి ఫణికుమార్ సైతం ఇదే అంశంపై మాట్లాడారు. అధికారులు బస్సుల కొరత వల్ల ట్రిప్పులు తగ్గించామని దీనిపై ఉన్నతాధికారులకు తెలిపి బస్సు సర్వీసులు పెంచేలా చూస్తామని బదులిచ్చారు. విద్యాశాఖ అధికారుల తీరుపై ఎంపీటీసీ కాళిశెట్టి ఫణికుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంగంజాగర్లమూడి గ్రామ సర్పంచ్ అవార్డు అందుకోవడంపై అభినందనలు తెలిపారు. మండలంలోని హాఫ్‌పేట ఎంపీటీసీ ఇసుకపల్లి సుందరరావు, గ్రామ సర్పంచ్ టి.యర్రయ్యలు జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని డ్రెయిన్లలో నీరు పంట పొలాలకు వెళుతున్నాయని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని అర్జీ అందించారు. పలువురు సర్పంచ్‌లు ఆయా గ్రామాల సమస్యలపై సభలో విన్నవించి పరిష్కరించాలని కోరారు. జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, ఏవో ఆచంటి శ్రీనివాసరావు, సాయి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

విలువలతో కూడిన విద్యను అందించాలి: ఆలపాటి

తెనాలి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను నేటి తరానికి అందించాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మంగళవారం ఫౌండర్స్ డే నిర్వహించారు. నన్నపనేని వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో రాణించేందుకు ప్రతి ఒక్కరిలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్నో ఏళ్లక్రితం అందరికీ విద్య అందించేందుకు కళాశాలను స్థాపించారని, వేలాదిమంది చదువుకుని వివిధ హోదాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నన్నపనేని రాజకుమారి, ముకుందరావు, నన్నపనేని సుధాకర్, నన్నపనేని భాస్కర్, సుగుణ, రవీంద్రనాద్, కొలసాని తులసీ విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సెలవు పెట్టుకునే హక్కు లేదా?: ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించిన నిబంధనల మేరకు ఉపాధ్యాయులు సెలవు పెట్టుకునే హక్కు లేదా అని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు జిల్లా విద్యా శాఖ అధికారులను, పౌరసరఫరాల శాఖా మంత్రిని ప్రశ్నించారు. తెనాలిలోని ఎన్ఎస్ఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉపాధ్యాయుల హాజరుపట్టీని పరిశీలించి మొత్తం 24మంది టీచర్లకుగాను నిబంధనల మేరకు ఏడుగురు సెలవులు పెడితే ప్రధానోపాధ్యాయులను అందరి ముందు ఎలా అనుమతి ఇచ్చారని దబాయించి, వీడియో తీసి వైరల్ చేయడాన్ని ఏటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

సోదరి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తెనాలి మారీసుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన తన సోదరి ఎటువంటి కారణాలతో చనిపోయిందో తేల్చాలంటూ అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. మంగళగిరి మండలం ఎర్రబాలెంకి చెందిన గాజుల పావని (36) కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జేరింది. ఈ నెల 24న శస్త్రచికిత్స చేసి ఆపరేషన్ విజయవంతమైందని తెలిపారు. ఇంతలో ఆమెకు కడుపు నొప్పి రావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. దీనితో మృతిరాలి సోదరుడు నాగరాజు తన చెల్లి మృతికి ఆపరేషన్ వికటించి చనిపోయిందా లేక మరి ఏ ఇతర కారణంతో మృతి చెందిందో దర్యాప్తు చేసి తేల్చాలని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు.



రక్తదానం చేస్తున్న ఆర్‌వీఐటీ విద్యార్థులు

ఆర్‌వీఐటీ విద్యార్థుల రక్తదానం

చేబ్రోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఆర్‌వీఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు రక్తదానం చేశారు. శ్రీవెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం జరిగింది. విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



మినుము పైరును పరిశీలిస్తున్న అధికారులు

మినుములో బూడిద తెగులును నివారించాలి: ఏవో

పొన్నూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మినుము పైరులో బూడిద తెగులు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో డేగల వెంకటరామయ్య సూచించారు. మండల పరిధిలోని కొండముది, వడ్డిముక్కల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగవుతున్న మినుము, పెసర పంటలను పరిశీలించి చీడపీడల నివారణ చర్యలు సూచించారు. బూడిద తెగులు ఉధృతి అధికంగా ఉన్నందున మైక్‌లో బుటానియన్ తెగులు ముందును 100 నుంచి 120 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పల్లాకు తెగులు కనిపిస్తున్నందున తెల్లదోమ నివారణ చర్యలను సూచించారు. పంటలో పోషకాలపై పాటుగా అందించేందుకు ఫార్ములేషన్ నెంబరు 400గ్రామాలు ఎకరానికి పొటాషియం నైట్రేట్ ఒక కేజీ కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బాలకృష్ణ (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): వడ్డిముక్కల గ్రామానికి చెందిన చింతగుంట బాలకృష్ణ (65) ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొన్నూరు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.